
రుణ పరిమితి ఖరారు..



- 122 పంటలకు వర్తింపు
- ఈసారి స్వల్పంగానే పెంపుదల
- వరికి రూ.45వేలు, పత్తికి రూ.21వేల పరిమితి
- నాబార్డు వ్యవసాయ రుణ లక్ష్యం రూ.3189.07 కోట్లు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

వానాకాలం సీజన్ ఆరంభానికి ముందే పంట రుణాల పరిమితి (స్కేల్ఆఫ్ ఫైనాన్స్) ప్రణాళికను ఖరారు చేశారు. రాష్ట్రస్థాయి సాంకేతిక కమిటీ నిర్ణయం మేరకు 2025-26 వానాకాలం, యాసంగి సీజన్‌లకు సంబంధించిన 122 పంటలకు సంబంధించి రుణ పరిమితిని పెంచారు. గతేడాదితో పోలిస్తే రాజన్న సిరిసిల్ల జిల్లాలో సాగు చేసే ప్రధాన పంటల్లో కొన్ని పంటలకు మాత్రమే స్వల్పంగా పరిమితి పెరిగింది. జిల్లాలో ప్రధానంగా వరి సాగు ఎక్కువగా ఉంటుంది. ఈసారి వరి, కంది, మొక్కజొన్న, మినుములు, పెసర, శెనగ, జొన్న తదితర పంటలకు రుణ పరిమితి పెంచలేదు. పత్తి సాగుకు రూ.2 వేలు మాత్రమే పెంచారు. గతేడాది రూ.46 వేల వరకు ఉండగా ఈసారి రూ.48 వేలకు పెరిగింది. పాడి రైతులకు డెయిరీ పెట్టుకోవడానికి ఆవుకు, గేదెకు రూ.33 వేల నుంచి రూ 35వేల వరకు రుణం ఇవ్వాలని సూచించారు. గొర్రెలు,మేకలు కొనుగోలుకు సంబంధించి రూ.29 వేలు, ఒక్కో కోడిపిల్లకు రూ.200 నుంచి రూ.210 చొప్పున, చేపలు ఒక హెక్టార్‌కు రూ.4లక్షలు ఇవ్వాలని నిర్ణయించారు. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం బ్యాంకర్లు రుణ లక్ష్యాలను అధిగమించే ప్రయత్నం చేస్తున్న రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు.

● నాబార్డు రుణ లక్ష్యం రూ.3948 కోట్లు..

రాజన్న సిరిసిల్ల జిల్లాలో 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ.3948.01 కోట్లు జాతీయ వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బ్యాంక్(నాబార్డ్) రుణం అందించాలని ప్రణాళికలు రూపొందించింది. ప్రొటెన్షియన్ లింక్‌డ్ క్రెడిట్ ప్లాన్(పీఎల్‌పీ)ని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా సమక్షంలో గత నెలలో నాబార్డు డీడీఎం దిలీప్ చంద్రం, ఎల్‌డీఎం మల్లికార్జున్‌రావు, డీఆర్‌డీవో శేషాద్రి, డీసీవో రామకృష్ణలు విడుదల చేశారు. దాని ప్రకారం జిల్లాకు రూ.3948.01కోట్ల రుణ సహాయాన్ని అందించాలని జిల్లాలోని బ్యాంక్‌లకు నిర్దేశించింది. గతేడాది లక్ష్యంకంటే 23శాతం అదనంగా రూపొందించారు. వ్యవసాయానికి రూ.3189.07 కోట్లు, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు రూ.612.30 కోట్లు, ఎగుమతులకు రూ.3.20 కోట్లు, విద్యారంగానికి రూ.28కోట్లు, గృహ నిర్మాణాలకు రూ.40.04కోట్లు, సామాజిక మౌలిక సదుపాయాలకు..

మిగతా 8లో

పంటల రుణపరిమితి ఇలా... (రూపాయల్లో)

పంట	2023-2024	2024-2025	2025 -2026
వరి	42000 - 45000	43000 - 45000	44000 - 46000
వరి విత్తనోత్పత్తి	46000 - 50000	48000 - 50000	48000 - 50000
పత్తి	42000 - 45000	44000 - 46000	46000 - 48000
పత్తి విత్తనోత్పత్తి	----	140000 - 150000	140000 - 150000
జొన్న	17000 - 19000	18000 - 20000	19000 - 21000
జొన్న విత్తనోత్పత్తి	22000 - 25000	24000 - 26000	24000 - 26000
మొక్కజొన్న	30000 - 34000	32000 - 34000	34000 - 36000
కంది	21000 - 24000	22000 - 24000	23000 - 25000
మినుములు	18000 - 21000	19000 - 21000	20000 - 22000
పెసర్లు	19000 - 22000	20000 - 22000	20000 - 22000
శెనగలు	----	24000 - 26000	25000 - 27000
సన్ ఫ్లవర్	26000 - 29000	27000 - 29000	28000 - 30000
సోయాబీన్	26000 - 28000	28000 - 30000	28000 - 30000
వేరుశెనగ	28000 - 30000	28000 - 30000	30000 - 32000
అముదం	18000 - 20000	19000 - 21000	20000 - 21000
మిర్చి	70000 - 80000	82000 - 84000	84000 - 86000
టమాట	50000 - 55000	53000 - 55000	55000 - 57000
క్యారెట్	30000 - 32000	32000 - 34000	32000 - 34000
ఆయిల్ పాం	40000 - 42000	42000 - 44000	46000 - 48000
నిమ్మకాయ	45000 - 50000	45000 - 50000	45000 - 47000
వంకాయ	50000 - 53000	53000 - 55000	55000 - 57000
ఉల్లిగడ్డ	40000 - 45000	43000 - 45000	45000 - 47000
క్యాబేజీ	32000 - 34000	33000 - 35000	33000 - 35000
కాలీ ఫ్లవర్	32000 - 34000	33000 - 35000	33000 - 35000
కొత్తిమీర	22000 - 25000	23000 - 25000	24000 - 26000
మునక్కాయలు	32000 - 35000	33000 - 35000	34000 - 36000
అల్లం	----	65000 - 67000	69000 - 71000
మామిడి	40000 - 42000	42000 - 44000	45000 - 47000
బొప్పాయి	60000 - 65000	65000 - 67000	67000 - 69000
డ్రాగన్ ఫ్రూట్స్	65000 - 75000	78000 - 80000	78000 - 80000

బాధితులకు భరోసా కల్పించాలి : ఎస్పీ



పోలీస్‌స్టేషన్ ఆవరణను పరిశీలిస్తున్న ఎస్పీ

ఇల్లంతకుంట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : పోలీస్‌స్టేషన్‌కు వివిధ కారణాలతో వచ్చే బాధితులకు పని అవుతుందనే భరోసా కల్పించాలని ఎస్పీ మహేష్ బి గితే పేర్కొన్నారు. మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను బుధవారం పరిశీలించారు. పోలీస్‌స్టేషన్‌లోని రికార్డులను, వివిధ గ్రామాలలో జరిగిన సంఘటనల వివరాలను అడిగి తెలుసుకున్నారు. తరచూ నమోదవుతున్న కేసుల వివరాలు, పెండింగ్‌లో ఎన్ని కేసులు ఉన్నాయో ఎస్సై ద్వారా వివరాలు సేకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్ వచ్చే బాధితుల ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని సూచించారు. పెట్రోలింగ్ సమయంలో అనుమానిత వ్యక్తులను తనిఖీ చేయాలన్నారు. రౌడీషీటర్ల ప్రస్తుత పరిస్థితిపై నిరంతరం నిఘా కొనసాగించాలన్నారు. సైబర్ నేరాలు, మత్తుపదార్థాల వినియోగం వల్ల కలిగే చెడు ఫలితాలపై గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సిబ్బందికి ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి, ఎస్సై కదిరె శ్రీకాంత్‌గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

బిందుసేద్యం ప్రారంభం

పోలీస్‌స్టేషన్ ఆవరణలో పెంచిన పండ్ల తోటకు బిందుసేద్యాన్ని ఎస్పీ ప్రారంభించారు. ఖాళీస్థలం ఎక్కువగా ఉన్నందున అన్నిరకాల పండ్లతోటలను పెంచాలన్నారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని పరిరక్షించే బాధ్యత తీసుకోవాలన్నారు.

రాజన్నను దర్శించుకున్న ప్రెస్ అకాడమీ చైర్మన్



రాజన్న ఆలయంలో పూజలు చేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి, విరాహత్ అలీ

వేములవాడ కల్చరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామివారిని ప్రెస్ అకాడమీ చైర్మన్ కే శ్రీనివాస్‌రెడ్డి, టీయూడబ్ల్యూజే(ఐజేయూ) రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ దర్శించుకున్నారు. రాజన్న ఆలయానికి విచ్చేసిన వారికి ఆలయ అర్చకులు ఘనస్వాగతం పలికారు. ప్రత్యేక పూజ అనంతరం అద్దాల మండపంలో అర్చకులు ఆశీర్వచనం ఇవ్వగా, ఆలయ ఈవో వినోద్‌రెడ్డి రాజన్న ప్రసాదాన్ని అందజేశారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు, కార్యదర్శి, జిల్లా అధ్యక్షుడు జర్నలిస్టులు ఉన్నారు.

ప్రెస్ అకాడమీ చైర్మన్‌కు సన్మానం

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డిని బుధవారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో కార్యవర్గం, సభ్యులు సన్మానించారు. వేములవాడ రాజరాజేశ్వరస్వామిని దర్శించుకున్న శ్రీనివాస్‌రెడ్డిని కలిసిన ప్రెస్‌క్లబ్ కార్యవర్గ సభ్యులు సిరిసిల్లకు ఆహ్వానించారు. సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో ఆయనతో పాటు టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ ఆలీని సభ్యులు సన్మానించారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు ఆకుల జయంత్, ఉపాధ్యక్షుడు బొడ్డు పర్శ రాములు, ప్రధానకార్యదర్శి ఆడెపు మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రిస్క్రిప్షన్ ఉంటేనే మందులు విక్రయించాలి

వేములవాడ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ల ప్రిస్క్రిప్షన్ ఉన్నవారికి మాత్రమే మందులు విక్రయించాలని జిల్లా ఔషధ తనిఖీ అధికారి భవాని అన్నారు. వేములవాడ పట్టణంలోని పలు మందులు దుకాణాలను బుధవారం ఆమె తనిఖీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రతి దుకాణం యజమాని మందుల బిల్స్ అందుబాటులో ఉంచుకోవాలని, వైద్యుల ప్రిస్క్రిప్షన్ ఉన్నవారికి మాత్రమే మందులు విక్రయించాలన్నారు. వైద్యుల సూచనలు లేకుండా మందులు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించాలి...



వినతిపత్రం అందిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

వీర్నపల్లి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : చాలీచాలని జీతాలతో పనిచేస్తున్న ఉపాధిహామీ ఫీల్డ్‌అసిస్టెంట్‌ల సమస్యలను పరిష్కరించాలని ఫీల్డ్‌అసిస్టెంట్ మండల కమిటీ డిమాండ్ చేసింది. మండల పరిషత్ కార్యాలయంలో సమస్యలను పరిష్కరించాలంటూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక ఎంపీడీవో అబ్దుల్ వాజిద్‌కు బుధవారం వినతి పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

● తంగళ్లపల్లి : మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవోకు ఉపాధిహామీ ఫీల్డ్‌అసిస్టెంట్లు వినతిపత్రం సమర్పించారు. ఫీల్డ్‌అసిస్టెంట్ల సంఘం మండల అధ్యక్షుడు కొమ్మట దేవయ్య, జిల్లా ప్రచార కార్యదర్శి పసుల శేఖర్, ఫీల్డ్‌అసిస్టెంట్లు ఆకునూరి శ్రీనివాస్, సాయిల పూర్ణచందర్, తిరుపతి, శ్రీనివాస్, బాలకిషన్, ఆంజనేయులు, కనకరాజు ఉన్నారు.

నేటి నుంచి భూ భారతి చట్టంపై సదస్సులు

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఉన్న భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన ఆర్వోఆర్ చట్టం భూభారతిపై అవగాహన కల్పించేందుకు ఈనెల 17నుంచి 29వరకు అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా బుధవారం షెడ్యూల్ విడుదల చేశారు. సదస్సుల్లో అదనపు కలెక్టర్, రెవెన్యూ అధికారులు చట్టంపై అవగాహన కల్పిస్తారని తెలిపారు. 17న ఉదయం 10 గంటలకు బోయినపల్లి మండలం, 19న ఉదయం 10 గంటలకు ఇల్లంతకుంట, 21న మధ్యాహ్నం 2 గంటలకు కోనరావుపేట, 22న ఉదయం 10 గంటలకు చందుర్తి, మధ్యాహ్నం 2 గంటలకు రుద్రంగి, 23న ఉదయం 10 గంటలకు వేములవాడ రూరల్, మధ్యాహ్నం 2 గంటలకు వేములవాడ, 24న ఉదయం 10గంటలకు గంభీరావుపేట, 25న ఉదయం 10గంటలకు ముస్తాబాద్, 26న ఉదయం 10 గంటలకు తంగళ్లపల్లి, 28న మధ్యాహ్నం 2 గంటలకు సిరిసిల్ల, 29న ఉదయం 10 గంటలకు ఎల్లారెడ్డిపేట, మధ్యాహ్నం 2 గంటలకు వీర్నపల్లిలో భూ భారతిపై చట్టంపై అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. అవగాహన సదస్సులను విజయవంతం చేయాలని, సదస్సులకు జిల్లా నోడల్ అధికారిగా సిరిసిల్ల ఆర్డీవో రాధాబాయిని నియమించినట్లు తెలిపారు.

సీనియర్ సిటిజన్ చట్టం పోస్టర్ ఆవిష్కరణ

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో బుధవారం తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముద్రించిన సీనియర్ సిటిజన్ చట్టం పోస్టర్‌ను ఎస్పీ మహేష్ బీ గితే ఆవిష్కరించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చేపూరి బుచ్చయ్య, ప్రధానకార్యదర్శి జనపాల శంకరయ్య, కోశాధికారి దొంత దేవదాస్, సహాయ కార్యదర్శి అంకారపు జ్ఞానోబా, నాయకులు శ్రీగాధ మైసయ్య, శ్రీకాంత్ పాల్గొన్నారు.

వార్డుల్లో పాదయాత్రలు



సిరిసిల్లలో పాదయాత్ర చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణంలోని పలు వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రలు నిర్వహించారు. బుధవారం సిరిసిల్ల పట్టణం 7వ వార్డులోని కొత్తబస్టాండ్ తెలంగాణ తల్లి చౌక్ వద్ద ఏఐసీసీ కోఆర్డినేటర్ అవేజ్ పార్టీ జెండాను ఆవిష్కరించి ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం 7వ వార్డు నుంచి పట్టణ ప్రధాన రహదారుల గుండా 6, 19, 24, 25, 36 వార్డుల్లో పాదయాత్రలను చేపట్టారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీరును ఎండగట్టారు. కాంగ్రెస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, మహిళ జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత, ప్రధాన కార్యదర్శి కోడం అరుణ, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు ఎండీ ఖాజా, వెంకటేశం, కాసర్ల రాజు, మాజీ కౌన్సిలర్ కుడికాల రవీందర్, మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు బొప్ప దేవయ్య, చేనేత వస్త్ర వ్యాపార సంఘం అధ్యక్షుడు తాటిపాముల దామోదర్, మహిళలు, నాయకులు పాల్గొన్నారు.

నేషనల్ సెమినార్ బ్రోచర్ ఆవిష్కరణ



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న అధ్యాపకులు

గంభీరావుపేట ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగే నేషనల్ సెమినార్ బ్రోచర్‌ను ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వి విజయలక్ష్మీ, ఆర్గనైసింగ్ సెక్రెటరీ శ్రవణ్‌కుమార్, అధ్యాపకుల ఆధ్వర్యంలో బుధవారం ఆవిష్కరించారు. సెమినార్లో వివిధ రాష్ట్రాల నుంచి డిగ్రీ, యూనివర్సిటీ స్థాయి అధ్యాపకులు పేపర్ ప్రజెంటేషన్, ప్యానల్ డిస్కషన్, పోస్టర్ ప్రజెంటేషన్ జరుగుతుందని విజయలక్ష్మి తెలిపారు.

స్కానింగ్ కేంద్రాలను నిరంతరం పర్యవేక్షించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్వీ కర్ణన్

సిరిసిల్ల, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లాలో లింగ నిర్ధారణ చేసే స్కానింగ్ కేంద్రాలపై కఠినచర్యలు తీసుకోవాలని, నిరంతరం స్కానింగ్ కేంద్రాల పనితీరును పర్యవేక్షించాలని వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ ఆర్వీ కర్ణన్ అన్నారు. బుధవారం రాజన్న సిరిసిల్ల కలెక్టరేట్‌లో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాతో కలిసి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పనితీరుపై సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జిల్లాలో స్కానింగ్ కేంద్రాలపై పర్యవేక్షించాలని భ్రూణ హత్యలు జరగకుండా పకడ్బందీగా చర్యలుతీసుకోవానలి అన్నారు. పీసీ ఎన్‌డీ యాక్ట్‌కు సంబంధించి ఎప్పటికప్పుడు జిల్లా సలహా కమిటీ సమావేశాలు నిర్వహించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అత్యధికంగా ప్రసవాలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని, అత్యవసర సమయంలోనే సీ సెక్షన్ ఆపరేషన్లు నిర్వహించాలన్నారు. జిల్లాలో నూతన ఆసుపత్రుల ఏర్పాటుకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ కలెక్టర్ ఆధ్వర్యంలో మాత్రమే జరగాలన్నారు. నూతన స్కానింగ్ కేంద్రాలు, పరీక్ష కేంద్రాల ఏర్పాటుకు కమిషనర్ అనుమతి తప్పనిసరి అని అన్నారు. జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సిబ్బంది మందుల కొరత రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అవసరాలకు అనుగుణంగా స్పెషలిస్ట్ డాక్టర్లను ఎప్పటికప్పుడు నియమించుకోవాలని, వ్యాధులకు సంబంధించి అవసరమైన మందులు ప్రభుత్వం వద్ద ఉన్నాయన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల వద్ద అందుబాటులో ఉన్న మందుల వివరాలను వైద్య సిబ్బందికి అవగాహన కల్పించాలని అన్నారు. అందుబాటులో ఉన్న మందులను మాత్రమే రోగులకు అందించాలని రోగులు అనవసరంగా ప్రైవేటుగా మందులు కొనాల్సిన అవసరం రావద్దని అన్నారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన టీ డయాగ్నోస్టిక్, టీ హబ్ వివరాలు తెలుసుకున్నారు. డయాగ్నోస్టిక్ కేంద్రాల ద్వారానే పరీక్షలు నిర్వహించాలని అన్నారు. రేడియాలజీ విభాగానికి సంబంధించి పరీక్షల నివేదికలు అందించాలని అన్నారు. ఈ సమావేశంలో డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ రజిత, డాక్టర్ లక్ష్మీనారాయణ, డాక్టర్ పెంచలయ్య, ప్రోగ్రాం అధికారులు పాల్గొన్నారు.

సోనియాగాంధీ, రాహుల్‌గాంధీపై ఈడీ కేసులు ఎత్తివేయాలి

- బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయం ఎదుట కాంగ్రెస్ ధర్నా



ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : ఏఐసీసీ మాజీ అధ్యక్షులు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీపై కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం అక్రమంగా పెట్టించిన ఈడీ కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం సిరిసిల్ల పట్టణం బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయం ఎదుట కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. స్థానిక కొత్త బస్టాండ్ తెలంగాణ తల్లి విగ్రహం నుంచి ర్యాలీగా బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయానికి కాంగ్రెస్ నాయకులు చేరుకొని గేటు ముందు బైఠాయించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐసీసీ కో ఆర్డినేటర్ అవేజ్ మాట్లాడారు. దేశ వ్యాప్తంగా రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రలకు ప్రజల నుంచి వస్తున్న ఆదరణతో నరేంద్రమోదీ గుండెల్లో రైళ్ళు పరిగెడుతున్నాయన్నారు. రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రలను ఆపాలని ఏఐసీసీ మాజీ అధ్యక్షులు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీపై కుట్ర పూరితంగా ఈడీ కేసులను పెడుతున్నారని ఆరోపించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎలాంటి ఇబ్బందులకు గురిచేసిన రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రలు ఆగవని హెచ్చరించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయం ఎదుట బైఠాయించిన కాంగ్రెస్ నాయకులను బలవంతంగా ధర్నాను విరమింప జేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, మహిళ జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత, ప్రధాన కార్యదర్శి కోడం అరుణ, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు ఎండీ ఖాజా, వెంకటేశం, కాసర్ల రాజు, మాజీ కౌన్సిలర్ కుడికాల రవీందర్, మున్నూరుకాపు సంఘం జిల్లా అధ్యక్షుడు బొప్ప దేవయ్య, చేనేత వస్త్ర వ్యాపార సంఘం అధ్యక్షుడు తాటిపాముల దామోదర్, మహిళలు, నాయకులు పాల్గొన్నారు.

గంజివాగుపై హైలెవల్ వంతెనను పూర్తిచేయాలి

- స్థంభంపల్లి నుంచి కలెక్టరేట్‌కు గ్రామస్థుల పాదయాత్ర



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న స్థంభంపల్లి గ్రామస్థులు

సిరిసిల్ల కలెక్టరేట్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : బోయినపల్లి మండలం స్థంభంపల్లి శివారులోని గంజివాగుపై నిర్మిస్తున్న హైలెవల్ వంతెన పనులు పూర్తి చేయాలంటూ బుధవారం గ్రామస్థులు కలెక్టరేట్ వరకు తరలివచ్చి ధర్నా చేశారు. గంజివాగు చేపట్టిన హైలెవల్ వంతెన నిర్మాణాలను గత పదినెలలుగా నిలిపివేశారు. ప్రతి వర్షాకాలంలో స్థంభంపల్లి, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు వాగును దాటేందుకు ఇబ్బందులు పడుతున్నారని, గత ప్రభుత్వం గంజివాగుపై హైలెవల్ వంతెన నిర్మాణానికి నిధులను మంజూరుచేయగా పనులు అర్ధంతరంగా నిలిపివేశారని గ్రామస్థులు తెలిపారు. ఎలాంటి సూచిక బోర్డులను ఏర్పాటుచేయకపోవడంతో వాహనాదారులు ప్రమాదాలకు గురవు తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి నిలిచిపోయిన వంతెనను పూర్తిచేయాలంటూ కలెక్టరేట్ ఏవో రాంరెడ్డికి వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో స్థంభంపల్లి మాజీ సర్పంచ్ అక్కెనపల్లి జ్యోతికరుణాకర్, మాజీ ఉప సర్పంచ్‌లు బొంగాని అశోక్, బీరవెల్లి వెంకటేశ్వర్‌రావు, రెడ్డి సంఘం అధ్యక్షుడు ముచ్చే లింగారెడ్డి, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు తునికి తిరుమలేష్, శాలివాహన సంఘం అధ్యక్షుడు రాచర్ల రాజేష్, అంబేద్కర్ సంఘం ఉపాధ్యక్షుడు అక్కెనపల్లి గణేష్, అక్కెనపల్లి రమేష్, గొర్రె విజయ్, గౌడ సంఘం నాయకులు పులి అంజయ్య, కాసారపు మల్లేశం, ముత్యపు పర్శరాములు తదితరులు పాల్గొన్నారు.

● బోయినపల్లి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మధ్యలో నిలిచిపోయిన గంజి వాగులో లెవెల్ వంతెన నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని బోయినపల్లి మండలం స్తంభంపల్లి గ్రామస్థులు కలెక్టరేట్ కార్యాలయానికి పాదయాత్ర ద్వారా బుధవారం తరలివెళ్లారు. ఈసందర్భంగా మార్గమధ్యంలో ఉన్న వేములవాడ రాజన్న ఆలయాన్ని, అగ్రహారం ఆంజనేయ స్వామి దర్శించుకున్నారు. రాష్ట్ర మాజీ సర్పంచ్‌ల జేఏసీ అధ్యక్షుడు అక్కనపల్లి జ్యోతికరుణాకర్ మాట్లాడుతూ వంతెన నిర్మాణ పనులు వెంటనే చేపట్టకపోతే బోయినపల్లి, వేములవాడ, గంగాధర మండల ప్రజలతో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను చేపడతామని హెచ్చరించారు.

తండ్రిని చితకబాదిన కొడుకుపై కేసు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): పొలం అమ్మగా వచ్చిన డబ్బులను తనకు ఇవ్వాలని కన్న తండ్రిని చితకబాదిన సంఘటనలో ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లికి చెందిన వేముల రాజుపై కేసు నమోదు చేశామని ఎస్సై రమాకాంత్ బుధవారం తెలిపారు. గ్రామంలోని వేముల సత్తయ్య అతని కొడుకు రాజుతో కలిసి జీవిస్తున్నాడని పేర్కొన్నారు. మూడేళ్ల కిందట సత్తయ్య పేరిటఉన్న పొలాన్ని అమ్మగా రూ.18 లక్షలు వచ్చాయని చెప్పారు. ఆ డబ్బులు నుంచి సత్తయ్య తన కొడుకు రాజుకు రూ.12లక్షలు ముట్ట చెప్పాడని పేర్కొన్నారు. ఈనెల 15న మిగిలిన డబ్బులు తనకు ఇవ్వాలని తండ్రి సత్తయ్యతో గొడవకు దిగాడని, అంతటితో ఆగని రాజు బండరాయితో దాడి చేశాడని పేర్కొన్నారు. తీవ్ర గాయాలపాలైన సత్తయ్యను సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారని చెప్పారు. బాధితుడి కూతురు పిట్టల రాధ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్సై రమాకాంత్ వివరించారు.

కొడుకు తిండి పెట్టడం లేదు..

● తహసీల్దార్‌కు మొరపెట్టుకున్న మాజీఎంపీటీసీ

శంకరపట్నం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): తాను కష్టపడి సంపాదించిన భూమి సాగు చేసుకుంటూ.. తాను నిర్మించిన ఇంట్లో ఉంటూ తనకు కనీసం తిండి పెట్టడంకుండా తన కొడుకు ఇబ్బందులు పెడుతున్నాడని రాజాపూర్ మాజీ ఎంపీటీసీ ఆసరి అయిలయ్య శంకరపట్నం తహసీల్దార్‌కు బుధవారం గోడువెల్లబోసుకున్నాడు. ఈ సందర్భంగా తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తాను సంపాదించిన భూమి, ఇంటిని తిరిగి ఇప్పించాలని వేడుకున్నారు. కాగా ఆసరి అయిలయ్య స్థితిగతులు తెలుసుకున్న తహసీల్దార్ భాస్కర్ గ్రామంలో విచారణ చేయాలని ఆర్‌ఐ బాలకిషన్‌ను ఆదేశించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

జమ్మికుంట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణంలోని హుజూరాబాద్ రోడ్డులో ట్రాక్టర్, బైక్‌ను ఢీకొట్టిన సంఘటనలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని పద్మశాలి వీధికి చెందిన పెరుమాండ్ల సుధాకర్ బైక్‌పై దినేష్ ఫంక్షన్‌హాల్‌లో ఓ శుభ కార్యానికి హాజరై జమ్మికుంట వైపు వస్తున్నాడు. అదేరోడ్డులో ట్రాక్టర్ (టిఎస్ 022 7910) మక్కల లోడుతో వేగంగా వస్తోంది. ట్రాక్టర్‌ను ఓవర్‌టెక్ చేసే క్రమంలో ట్రాక్టర్ ముందు భాగం బైక్‌కు తగిలింది. దీంతో బైక్‌పైనున్న సుధాకర్ కింద పడిపోయాడు. ట్రాక్టర్ ముందు బైక్‌పైకి ఎక్కడంతో లోడుతో ఉన్న ట్రాక్టర్ వెనుకభాగం బోల్తాపడింది. ఈ ప్రమాదంలో సుధాకర్ తలకు తీవ్రగాయాలయ్యాయి. హుటాహుటిన అతన్ని ఆసుపత్రికి తరలించారు. బాధితుడి సోదరి సరోజన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వరంగంటి రవికుమార్ తెలిపారు.



పాడి రైతులు పారాహుషార్

● ఎండల వేళ పశువులు జాగ్రత్త

● వడదెబ్బ నుంచి రక్షణ కల్పించాలి

చొప్పదండి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): వేసవిలో మనుషులే కాదు మూగజీవాలు కూడా వడదెబ్బకు గురవుతుంటాయి. ఎండల వేళ పశుపోషణలో మెళకువలు పాటించకపోతే వాటి ప్రాణానికి ప్రమాదమే. యజమానులకు నష్టమే మిగులుతుంది. అధిక ఉష్ణోగ్రతలు, గాలి ప్రసరణ సరిగా లేకపోవడం, పశువుల పాకల్లో అధిక సంఖ్యలో జీవాలను కిక్కిరిసి ఉంచడం, నీళ్లు అందుబాటులో లేకపోవడం వల్ల పశువులు, గొర్రెలు, మేకలు వడ దెబ్బకు గురవుతాయి. వడదెబ్బకు గురైన పశువులు క్రమంగా నీరసించి బలహీనంగా మారుతాయి. వాటి చర్మం పొడిబారుతుంది. పశువుల సరిగ్గా నడవలేక తూలుతూ ఉంటాయి. జీవక్రియ తగ్గిపోయి ఆకలి మందగిస్తుంది. దీంతో ఆహారం తక్కువగా తీసుకుంటాయి. పశువులు ఎదకు రాకపోగా చూడికట్టే అవకాశాలు తగ్గిపోతాయి. రోగనిరోధక శక్తి తగ్గడం వల్ల ఇతర వ్యాధులు, పరాన్న జీవులు ఆశించే అవకాశం ఉంటుంది. చూడి పశువుల్లో గర్భస్రావాలు సంభవిస్తాయి. ఎండ వేడిమికి దాణా సరిగా తినకపోవడం మూలంగా పాల దిగుబడి తగ్గిపోతుంది. ఎండ నుంచి పశువులను రక్షించుకుంటేనే పాడి పోషణ లాభదాయకంగా ఉంటుంది.

పాకల్లో చల్లదనం కోసం ఏర్పాట్లు

పశువుల పాకల్లో పైకప్పులకు తెల్లరంగు వేసి ఆపై గడ్డి, తాటి, కొబ్బరి వంటి ఆకులను పరచడం లాంటి చర్యల ద్వారా ఎండ వేడి షెడ్లలోకి ఎక్కువగా ప్రవేశించకుండా చూడవచ్చు. మధ్యాహ్న సమయంలో పాకల చుట్టూ గోతాలు, పరదాలు వేలాడదీసి వాటిని తరచు నీటితో తడపడం మంచిది. అత్యధిక పాలిచ్చే సంకరజాతి ఆవులు, ముర్రా గేదెలకు ఫ్యాన్లు ఏర్పాటు చేయడం ఎంతో అవసరం. పశువుల పాకలను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ గాలి ధారాళంగా ప్రసరించే విధంగా చూడాలి. పశువులను రోజుకు రెండు మూడు సార్లు చల్లని నీటితో కడగాలి.



మెళకువలు పాటించాలి

వేసవిలో పశువులకు అందించే మేత, దాణాలో మెళకువలు పాటిస్తేనే పాడి పోషణ లాభదాయకంగా ఉంటుంది. ఉదయం, సాయంత్రం వేళల్లో మేతకు తీసుకెళ్లాలి. వేసవి తాపంతో పశువుల్లో జీర్ణక్రియ మందగిస్తుంది. అందువల్ల సులువుగా జీర్ణించుకునే పిండి పదార్థాలైన గంజి, జావ వంటివి అందించాలి. ఎక్కువశాతం పచ్చిగడ్డి అందించాలి. పచ్చిగడ్డిని ఉదయం, ఎండు గడ్డిని రాత్రి సమయాల్లో కత్తిరించి ఇవ్వాలి. అధిక పాలు ఇచ్చే పశువులకు దాణాతో నీటిని కలిపి ఇవ్వాలి. మినరల్ మిక్చర్, ఉప్పు కలిపిన ద్రావణం ఇవ్వడం మరీ మంచిది. అలాగే వేసవిలో పశువుల్లో తాగునీటి అవసరాలు రెట్టింపవుతాయి. చల్లని శుభ్రమైన నీటిని పశువులకు ఎప్పుడూ అందుబాటులో ఉంచాలి. నీటి తొట్లను నీడలో ఉంచాలి. సాధ్యమైనంత వరకు ఎక్కువ నీళ్లు తాగేలా చూడాలి.

పశువుల్లో వడదెబ్బ లక్షణాలు

వడదెబ్బకు గురైన పశువుల్లో నాలుక బయట పెట్టడం, నీరు తాగకపోవడం, మేత తినకపోవడం, మూత్ర విసర్జన ఆగిపోవడం లాంటి లక్షణాలు కలిపిస్తాయి. కళ్లలో ఎర్రటి చారలు, నెమరు వేయలేకపోవడం తదితర లక్షణాలు ఉంటాయి. ఈ లక్షణాలు పశువుల్లో కనిపించిన వెంటనే ఉప్పు, బెల్లం కలిపిన ద్రావణం తాగించాలి. నిత్యం నాలుగైదు సార్లు చల్లని తాగునీటిని అందించాలి. రైతులు వెంటనే పశువైద్యుడిని సంప్రదించి చికిత్స అందించాలి.

వాహనాలను సీజ్ చేసిన అధికారులు

● 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

రామడుగు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): రామడుగు మండలం షానగర్ ఎల్లమ్మ చెరువులో చేపడుతున్న తవ్వకాలను ఇరిగేషన్ అధికారులు నిలిపివేశారు. ఇష్టారాజ్యంగా మట్టి తరలింపు అనే కథనం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితం కాగా ఇరిగేషన్ అధికారులు స్పందించారు. ఈఈ సుధాకర్ ఆదేశాలతో ఏఈ రఘురామ్ ఇతర సిబ్బందితో ఎల్లమ్మ చెరువుకు తరలవచ్చి వాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా మూడు వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించి ఫిర్యాదు చేసినట్లు ఏఈ రఘురాం తెలిపారు. పరిమితికి మించి ఎక్కువగా తీసిన తవ్వకాలపై ఫైన్ వేసినట్లు ఆయన వివరించారు.



పట్టుకున్న వాహనాలతో ఏఈ

కోతకు వచ్చిన ఆయిల్ పామ్ గెలలు

● మొదటి కాత మూడు టన్నుల దిగుబడి



ఆయిల్ పామ్ గెలలతో రైతులు, సంస్థ ప్రతినిధులు

మానకొండూర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేగురుపల్లి గ్రామానికి చెందిన నందిగొండ ముత్తారెడ్డి అనేరైతు తనకున్న 5.30 ఎకరాలలో ఆయిల్‌పామ్ సాగు చేశారు. మూడేళ్ల రెండు నెలలకు గెలలు పక్వానికివచ్చి మొదటిసారి కోతకు వచ్చింది. ఒప్పందంలో భాగంగా మొక్కలను అందించిన లోహియా ఎడిబిల్ ఆయిల్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ప్రతినిధులు కొనుగోలుచేశారు. మొదటిసారి మూడు టన్నుల దిగుబడిరాగా టన్నుకు రూ.21వేల ధర పలికింది. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ప్రోత్సహకాలు అందజేసి ప్రతిష్టాత్మకంగా ఆయిల్‌పామ్ పంటను సాగుచేయిగా చేతికి వచ్చిన పంటను సంస్థ కొనుగోలు చేయడం సంతోషదాయకమని రైతు ముత్తారెడ్డి తెలిపారు. దిగుబడి క్రమంగా పెరుగుతుందని రైతు తెలిపాడు. కూలీల ఖర్చు లేకుండా ఇతర పంటలకు ప్రత్యామ్నాంగా ఆయిల్ పామ్ పంటను సాగు చేయడం లాభదాయకంగా ఉంటుందన్నారు. గెలలను కొనుగోలుచేసిన వారం రోజులకు రైతుల ఖాతాల్లో జమచేయనున్నట్లు సంస్థ మేనేజర్ కే. విజయభరత్ తెలిపారు.

మెడికల్ కాలేజీకి మృతదేహం అప్పగింత

ఓదెల ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా ఓదెల మండలంలోని కొలనూర్‌కు చెందిన జిగురు ఓదెలు అనారోగ్యంతో మృతిచెందాడు. బుధవారం సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కరీంనగర్ ప్రతిమమెడికల్‌కళాశాలకు పార్థివదేహాన్ని కుటుంబ సభ్యులు అప్పగించారు. మృతుడికోరిక మేరకు కుటుంబ సభ్యులంతా మృతదేహాన్ని అప్పగించేందుకు నిర్ణయించుకోగా కొలనూర్‌లో సదాశయ ఫౌండేషన్, సుల్తానాబాద్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వైద్యకళాశాలకు అప్పగించారు. గతంలో జిగురు ఓదెలు, అతడి భార్య కనకలక్ష్మి దేహదానానికి అంగీకరించారు. ఈ నిర్ణయాన్ని ఆచరణలో పెట్టడం పలువురికి స్ఫూర్తిదాయకమని సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రావణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి భీష్మచారి తెలిపారు. అలాగే వైద్యకళాశాలకు మృతదేహాన్ని దానం చేయడంపై కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, బహుభాష కోవిదుడు నలిమెల భాస్కర్, వైద్య కళాశాల డీన్, సీతఃవోలు, సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు అభినందించారు.



ప్రతిమ వైద్యకళాశాలకు మృతదేహాన్ని అప్పగిస్తున్న కుటుంబ సభ్యులు

గిన్నిస్ బుక్ రికార్డు సాధించిన విద్యార్థి



మెక్‌ను అభినందిస్తున్న కరస్పాండెంట్ సునీల్ కుమార్

జమ్మికుంట రూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణంలోని సెయింట్ జోసఫ్ హైస్కూల్‌లో 9వతరగతి చదువుతున్న జోయల్ మెక్ పియానో వాయించడం పోటీల్లో గిన్నిస్‌బుక్ రికార్డు సాధించాడు. 2024డిసెంబర్ 1న నిర్వహించిన ప్రపంచస్థాయి మ్యూజిక్ ప్రదర్శనల్లో కీబోర్డు సంగీత కళాకారుల బృందం ఒకగంటలో 1046వీడియోలు అప్‌లోడ్‌చేసి ప్రపంచ రికార్డుసాధించింది. ఈ బృందంలో జోయల్‌మెక్ ఉన్నాడు. పాఠశాల కరస్పాండెంట్ వై సునీల్‌కుమార్ విద్యార్థిని అభినందించాడు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సహకారంతోనే గిన్నిస్‌రికార్డులో చోటు సంపాదించుకున్నానని విద్యార్థి తెలిపాడు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



రాజేశం (ఫైల్)

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి పట్టణంలోని కునారం రోడ్డువద్ద బుధవారం జరిగినరోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. చీకురాయి రోడ్డుకుచెందిన నాగులమల్యాల రాజేశం (59) ఉదయ్‌నగర్ నుంచి బస్టాండ్‌వైపు మోపెడ్‌పై వెళతున్నాడు. రాజీవ్‌రహదారి పైకి వచ్చే క్రమంలో వెనుకనుంచి వచ్చిన లారీ(టీజీ35 టీ 1125) ఢీకొట్టింది. దీంతో మోపెడ్‌పైనుంచి కిందపడిన రాజేశం తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులుహుటాహుటిన ప్రభుత్వాస్పత్రికి తరలించేలోపే రాజేశం మృతిచెందాడు. పోలీసులు లారీని పోలీస్‌స్టేషన్ తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ప్రభుత్వ ఉద్యోగం సాధించలేకపోయానని యువతి ఆత్మహత్య



ప్రత్యూష(ఫైల్)

కోల్‌సిటీ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగం సాధించ లేకపోయాననే మనస్తాపంతో పెద్దపల్లిజిల్లా గోదావరిఖని పవర్ హౌస్‌కాలనీకి చెందిన చుంచు ప్రత్యూష(26) అనే యువతి మంగళ వారం రాత్రి ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ప్రత్యూష తండ్రి విఠల్ గోదావరిఖని బస్టాండ్ సమీపంలో టీస్టాల్ నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ముగ్గురు కూతుర్లు కాగా, ఇద్దరు కూతుర్లకు వివా హం జరిపించాడు. చిన్న కూతురు ప్రత్యూష పీజీ చదివి పలు పోటీపరీక్షలకు హాజరవుతోంది. ఉద్యోగం సాధించ లేకపోయాననే మనస్తాపంతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు యువతితండ్రి విఠల్ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ భూమేష్ పేర్కొన్నారు.

మద్యానికి బానిసై ఒకరి బలవన్మరణం

రామడుగు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఒంటరి జీవితంతో వేగలేక మద్యానికి బానిసై జీవితంమీద విరక్తిచెందిన ఓవ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన రామడుగులో జరిగింది. ఎస్‌ఐ రాజు కథనం ప్రకారం.. రామడుగు మండల కేంద్రానికి చెందిన కావలి భూమయ్య(55) 25సంవత్సరాలుగా భార్యాపిల్లలకు దూరమై ఒంటరిగాతల్లితో ఉంటున్నాడు. నాలుగుసంవత్సరాల క్రితం తల్లి సైతం వృద్ధాప్యంతో మృతిచెందగా ఒంటరివాడైన భూమయ్య మద్యానికి బానిస అయ్యాడు. జీవితం విరక్తి చెందిన ఆయన 15వ తేదీన సాయంత్రం బయటకు వెళ్లి ఇంటికి తిరిగిరాలేదు. 16న ఉదయం తాటివనంలో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుసుకున్న బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతుడి అన్న కొడుకు కావలి రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

ముఖ్యమంత్రిని కించపరిచిన కేసులో..

● నిందితుడిని విచారించిన గోదావరిఖని సైబర్‌క్రైమ్ పోలీసులు

కోల్‌సిటీ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రిని, ప్రభుత్వాన్ని కించపరుస్తూ సోషల్ మీడియాలో పోస్టు పెట్టిన కేసులో నల్ల బాలు అనేవ్యక్తిని బుధవారం గోదావరిఖని సైబర్‌క్రైమ్ పోలీసులు విచారించారు.మార్చి16న సైబర్ క్రైమ్‌పోలీస్‌స్టేషన్‌లో సుమోటో కేసు నమోదైంది. ఈకేసులో బాలు న్యాయవాదితోపాటు బీఆర్ఎస్ నాయకులు కోరుకంటి చందర్, కౌశికహరితోకలిసి సైబర్‌క్రైమ్‌పోలీసుల ఎదుట హాజరయ్యారు. సైబర్‌క్రైమ్ ఎస్‌హెచ్ఓ డీఎస్పీ వెంకటరమణ ఆధ్వర్యంలో నిందితుడు నల్ల బాలును విచారించారు.

ఆపరేషన్ చేస్తుండగా కార్మికుడి మృతి

● వైద్యుల నిర్లక్ష్యం అంటూ బంధువుల ఆందోళన



ఆసుపత్రి ఎదుట రోదిస్తున్న బంధువులు, (ఇన్‌సెట్లో)చంద్రయ్య(ఫైల్)

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : కాలు విరిగి శస్త్రచికిత్స కోసం ప్రైవేటు ఆసుపత్రిలో చేరిన నేతకార్మికుడు ఆపరేషన్ థియేటర్లో కార్డియో అరెస్టుతో మృతిచెందిన సంఘటన బుధవారం రాత్రి సిరిసిల్ల పట్టణంలో చోటు చేసుకుంది. మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం... సిరిసిల్ల పట్టణం 25వ వార్డు పద్మానగర్‌కు చెందిన బైరి చంద్రయ్య (65)పవర్‌లూం నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. శనివారం ఇంటి నుంచి బయటకు వచ్చిన చంద్రయ్య నడుచుకుంటూ రోడ్డుపై కుప్పకూలిపోయాడు. బంధువులు పట్టణంలోని సిరి మల్టీస్పెషల్ ఆసుపత్రిలో చేర్పారు. వైద్యపరీక్షలు చేసిన ఆసుపత్రి వైద్యులు చంద్రయ్యకు తుంటి ఎముక విరిగిందని శస్త్ర చికిత్స(ఆపరేషన్) చేసి రాడువేయాలని సూచించారు. ఆసుపత్రిలో చేరిన నాటి నుంచి వైద్యులు అన్నిరకాల పరీక్షలు నిర్వహించారు. బుధవారం సాయంత్రం చంద్రయ్య కాలుకు ఆపరేషన్ కోసం ఆపరేషన్ థియేటర్‌లోకి తీసుకెళ్లారు. ఆసుపత్రిలోని అపరేషన్ థియేటర్‌లోకి తీసుకెళ్లిన గంట తరువాత చంద్రయ్యకు పల్స్ పడిపోయిందని, క్రిటికల్‌గా ఉందంటూ వైద్యులు చంద్రయ్య బంధువులకు తెలిపారు. అరగంట తరువాత కార్డియో అరెస్టు అయి చంద్రయ్య మృతిచెందాడంటూ వెద్యులు తెలపడంతో ఆ కుటుంబం షాక్‌కు గురైంది. ఆపరేషన్‌కు ముందు అందరితో మాట్లాడిన వ్యక్తి మృతిచెందాడంటూ వైద్యులు తెలపడంతో వైద్యుల నిర్లక్ష్యంతోనే మృతిచెందాడని ఆందోళన చేపట్టారు. థియేటర్లో ఆపరేషన్ వికటించే మరణించాడంటూ చంద్రయ్య బంధువులు కన్నీరుమున్నీరయ్యారు. అవాంఛనీయమైన సంఘటన జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. మృతుడి చంద్రయ్యకు భార్య కనకలక్ష్మి, కుమారులు మహేష్, మనోహర్ ఉన్నారు.

శ్రీనివాస్ మృతదేహాన్ని స్వదేశానికి తీసుకువచ్చేలా చర్యలు

● దుబాయ్ మృతుడి కుటుంబాన్ని ఆదుకుంటాం ● ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



శ్రీనివాస్ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న విప్ లక్ష్మణ్‌కుమార్, మాజీ మంత్రి జీవన్‌రెడ్డి

ధర్మపురి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): దుబాయ్‌లో దారుణంగా హత్యకు గురైన స్వర్గం శ్రీనివాస్ మృతదేహాన్ని స్వదేశానికి తీసుకువచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, మాజీఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి అన్నారు. మండలంలోని దమ్మన్నపేటగ్రామానికి చెందిన స్వర్గంశ్రీనివాస్‌ని దుబాయ్‌లో ఓ పాకిస్తానీ దారుణంగా నరికిచంపాడు. మండలంలోని దమ్మన్నపేట గ్రామంలో మృతుడి భార్య స్వర్గం జమున, కొడుకులు స్వర్గం చందు, సూర్యతో పాటు తల్లి స్వర్గం రాజవ్వను బుధవారం వారు పరామర్శించారు. అనంతరం మృతి వివరాలు అడిగి తెలుసుకుని తల్లి రాజవ్వకు వ్యక్తిగతంగా ప్రభుత్వవిప్ లక్ష్మణ్‌కుమార్ రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ద్వారా ఇండియన్ ఎంబసీ అధికారులతో మాట్లాడి శ్రీనివాస్ మృతదేహాన్ని వీలైనంత త్వరలో స్వదేశానికి తీసుకువచ్చే విధంగా కృషిచేస్తామని తెలిపారు. ప్రభుత్వం మృతుడి కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటుందని పేర్కొన్నారు. మృతుని కొడుకు డిగ్రీ చదివి ఉన్నాడని, అవుట్ సోర్సింగ్ జాబ్‌తోపాటు ఇందిరమ్మఇళ్లు, ఎన్‌ఆర్‌ఐపాలసీ కింద ప్రభుత్వం తరపున రూ.5లక్షలు ఎక్స్‌గ్రేషియా అందించే విధంగా చూస్తామని అన్నారు. శ్రీనివాస్‌ను హత్యచేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్‌చేశారు. వారివెంట టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, ధర్మపురి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, మండలకాంగ్రెస్ ఉపాధ్యక్షులు వేముల రాజేష్, జిల్లాకాంగ్రెస్ ఎస్సీసెల్ ఉపాధ్యక్షులు చిలుముల లక్ష్మణ్, పట్టణకాంగ్రెస్ అధ్యక్షులు చీపిరిశెట్టి రాజేష్, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు అప్పం తిరుపతి, మాజీ ఎంపీటీసీ తోడేటి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూలో జూనియర్ అసిస్టెంట్ పోస్టులకు ఆన్‌లైన్ పరీక్షలు

రామగిరి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రహైకోర్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జ్యుడిషియల్ మినిస్టీరియల్‌అండ్‌సబార్డినేట్ సర్వీసెస్ ఆన్‌లైన్ పరీక్ష బుధవారం జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రశాంతంగా ముగిసింది. జూనియర్ అసిస్టెంట్‌పోస్టులకు జరిగిన పరీక్షలో ఉదయం వందమందికి 67మంది, సాయంత్రం56మంది హాజరు కాగా 44మంది హాజరుకాలేదు.. ఎలాంటిఅవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్‌ఐ చంద్రకుమార్, పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



అభ్యర్థుల హాల్‌టికెట్‌లను చూస్తున్న సిబ్బంది

పెంపకానికి ఆరు రోజుల శిశువు

● జయశంకర్ జిల్లా వాసికి ఇచ్చిన మహారాష్ట్ర దంపతులు

● శిశువుకు అనారోగ్యంతో గోదావరిఖని ఆసుపత్రికి

● అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం ఇచ్చిన ఆసుపత్రి వర్గాలు

● శిశువు సంరక్షణ చేపట్టిన ఐసీపీఎస్



పెద్దపల్లి జిల్లా గోదావరిఖని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శిశువు

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రకు చెందిన దంపతులు తెలంగాణలోని జయశంకర్ భూపాలపల్లి జిల్లావాసికి ఆరు రోజుల శిశువును పెంపకానికి ఇవ్వడంపై దుమారం నెలకొన్నది. శిశువు అనారోగ్యంతో ఉండడంతో గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి మంగళవారం రాత్రి ఇద్దరు వ్యక్తులు తీసుకువచ్చారు. శిశువు వివరాలు పొంతన లేకుండా చెప్పడంతో అనుమానం వచ్చిన ఆసుపత్రి సిబ్బంది పోలీస్ అవుట్ పోస్టుకు సమాచారం ఇచ్చారు. దీంతో గోదావరిఖని ఏసీపీ రమేష్, సీఐ ఇంద్ర ఇంద్రసేనారెడ్డిలు విచారణ చేయడంతో అసలు విషయాలు వెలుగులోకి వచ్చాయి.

మహారాష్ట్ర బల్లార్షకు చెందిన దుర్గం, రవీంద్ర దంపతులు బ్రెడ్ కంపెనీలో కూలీ పని చేసుకుంటూ జీవిస్తున్నారు. ఇప్పటికే వీరికి ముగ్గురు సంతానం. నాలుగవ సంతానం కలుగడంతో పెంపకానికి ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. అదే సమయంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం చెందిన చాంద్‌పాషా తనకు పెంపకానికి శిశువు కావాలని మంచిర్యాలకు చెందిన మ్యారేజీ బ్యూరో నిర్వాహకురాలిని సంప్రదించాడు. ఆమె మహారాష్ట్రలో బ్రెడ్ కంపెనీలో పని చేసే శంకర్ అనేవ్యక్తి ద్వారా దుర్గం, రవీంద్రలను సంప్రదించింది. వారు తమ శిశువును పెంపకానికి ఇచ్చేందుకు అంగీకరించారు. మంగళవారం బల్లార్షా నుంచి శిశువును మంచిర్యాలకు తీసుకువచ్చి జయ, కాటారం చెందిన చాంద్‌పాషాలకు అప్పగించారు. శిశువును కాటారంకు తీసుకెళుతుండగా కదలికలు లేకపోవడంతో మంగళవారం రాత్రి గోదావరిఖనిలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యుల సూచన మేరకు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చేర్పించారు. పొంతన లేని సమాధానం చెప్పడంతో బుధవారం పోలీసులు మహారాష్ట్ర నుంచి బ్రెడ్ కంపెనీ నిర్వాహకులు, శిశువు తల్లిదండ్రులతోపాటు మంచిర్యాలకు చెందిన జయ, కాటారానికి చెందిన చాంద్‌పాషాలను విచారించారు.

చట్ట విరుద్ధంగా పెంపకానికి తీసుకువచ్చినట్టు గుర్తించారు. పెంపకానికి ఇచ్చిన విషయంలో ఎలాంటి ఆర్థిక లావాదేవీలు జరుగలేదని ఇరుపక్షాలు పేర్కొన్నాయి. శిశువు ఆరోగ్యం బాగా లేకపోవడంతో ప్రభుత్వ ఆసుపత్రిలోనే చికిత్స అందిస్తున్నారు. శిశువును పెద్దపల్లి జిల్లా మిషన్ వాత్సల్య(సమగ్ర బాలల పరిరక్షణ పథకం) అధికారుల పర్యవేక్షణకు అప్పగించారు. ప్రస్తుతం శిశువు వారి తల్లిదండ్రుల సంరక్షణలోనే ఉంది.

మామిడి రైతుకు మార్కెట్ కష్టాలు



- జగిత్యాలలో ప్రారంభమైన కొనుగోళ్లు
- కమీషన్ ఏజెంట్ల సిండికేట్‌తో నష్టాలు
- నామమాత్రంగా మారిన ఓపెన్ మార్కెట్
- పట్టించుకోని మార్కెటింగ్ శాఖ

జగిత్యాల, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మామిడికి ప్రసిద్ధి గాంచిన జగిత్యాలలో రైతులకు మార్కెటింగ్ కష్టాలు ఎదురవుతున్నాయి. జిల్లాలో మామిడి సాగు అధికంగా ఉన్నప్పటికీ మద్దతు ధర సౌకర్యం లేకపోవడంతో రైతులు ప్రైవేటులో విక్రయించక తప్పడం లేదు. ఈ క్రమంలో వ్యాపారులు సిండికేట్‌గా మారి మామిడి ధరలను అమాంతం తగ్గించేస్తున్నారు. దీంతో మామిడి రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. హైదరాబాద్, కరీంనగర్, ఇతర ప్రాంతాలతో పోలిస్తే జగిత్యాల మార్కెట్‌లో మామిడికి సరియైన ధర రావడం లేదు. అందుబాటులో ఉన్న ప్రైవేటు వ్యాపారులకు తక్కువ ధరలకే రైతులు పంటను అమ్ముకుంటున్నారు.


మామిడిని ప్యాక్ చేస్తున్న కార్మికులు

కోట్లలో వ్యాపారం

జగిత్యాల మామిడి మార్కెట్ 23 ఎకరాల్లో 2005లో ఏర్పాటు కాగా ప్రతీ సంవత్సరం సుమారు రూ.200 కోట్ల నుంచి రూ.250 కోట్ల వరకు వ్యాపారం జరుగుతుందన్న అంచనా ఉంది. చల్‌గల్ సమీపంలోని వాలంతరీ స్థలాన్ని మార్కెట్‌కు కేటాయించారు. రూ.10 కోట్లతో వ్యాపారులకు షెడ్లు నిర్మించారు. మామిడి కాయల కొనుగోలుకు సుమారు 90 మంది కమీషన్ ఏజెంట్లు, 59 మంది అడ్తిదారులు ఉన్నారు. వీరికి తోడు ఢిల్లీకి చెందిన పలువురు హోల్‌సెల్ వ్యాపారులు జగిత్యాలలో సీజన్ సమయంలో లాడ్జీల్లో తిష్టవేసి కమీషన్ ఏజెంట్ల ద్వారా కొనుగోలు చేసి పలు ప్రాంతాలకు పెద్దఎత్తున తరలిస్తుంటారు. సీజన్‌లో ఇక్కడి నుంచి మామిడి కాయలను పంజాబ్, హర్యానా, ఢిల్లీ, నాగ్‌పూర్, ముంబై వంటి ప్రాంతాలకు రోజూ కనీసం 5 నుంచి 10 లారీల్లో టన్నుల కొద్దీ తరలిస్తుంటారు.

నామమాత్రంగానే ఓపెన్ మార్కెట్

జగిత్యాల మార్కెట్‌లో కమీషన్ ఏజెంట్లు చెప్పిందే ధర అన్నట్టుగా తయారైంది. ఓపెన్ మార్కెట్ నిర్వహిస్తామని అధికారులు చెబుతున్నా అది నామమాత్రమే అన్న ఆరోపణలు ఉన్నాయి. ఒకరిద్దరు కమీషన్ ఏజెంట్లు మినహా ఓపెన్ మార్కెట్‌లో యాక్షన్‌లో ఎవరూ వ్యాపారులు గాని, అడ్తిదారులు గాని, కమీషన్ ఏజెంట్లు గాని భాగస్వామ్యం కావడం లేదు. ఓపెన్ మార్కెట్ అయితే రైతులు తొలుత ఏ వ్యాపారిని సంప్రదించాల్సిన అవసరం లేదు. మామిడి కాయలను తెంపుకొని మార్కెట్‌కు వచ్చి, కాంటా వేసుకొని కుప్పలు పోస్తే లైసెన్స్ పొందిన కమీషన్ ఏజెంట్లు, వ్యాపారులు వచ్చి మార్కెట్ అధికారుల సమక్షంలో కాయ నాణ్యతను బట్టి ధర నిర్ణయిస్తారు. అప్పుడు వ్యాపారుల్లో పోటీ పెరిగి రేటు ఎక్కువ వచ్చే అవకాశాలుంటాయి. ఓపెన్ యాక్షన్‌లో ఢిల్లీ వంటి ఇతర రాష్ట్రాల వ్యాపారులు సైతం పాల్గొంటే రైతులకు మరింత ధర వస్తుంది.


లారీల్లో లోడ్

తెచ్చి కాయలకు ఓ రేటు చెప్పి..తీరా మార్కెట్‌కు తెచ్చి తర్వాత కాయ బాగలేదంటూ రేటు తగ్గిస్తున్నారని రైతులు ఆవేదన చెందుతున్నారు. దీనికి తోడు క్యాష్ కటింగ్, కమీషన్ కటింగ్ అంటూ వ్యాపారులు దోచుకుంటున్నారని రైతులు అంటున్నారు.

పత్తాలేని మార్కెటింగ్ శాఖ

జగిత్యాల మామిడి మార్కెట్‌లో మార్కెటింగ్ శాఖ అధికారులు మచ్చుకు కూడా కనిపించడం లేదు. చీకటి సమయంలో జరిగే ఈ మార్కెట్‌కు అధి కారులు చుట్టపు చూపుగా వచ్చి వెళ్తున్నారు. అది కూడా కింది స్థాయి సిబ్బంది మినహా అధికారులు ఎవరూ రావడం లేదని రైతులు వాపోతున్నారు. జగిత్యాలలో మామిడి మార్కె ట్ సుమారు రాత్రి 8 గంటల సమయంలో ప్రారంభమై అర్ధరాత్రి వరకు కొనసాగుతోంది. నిబంధనల ప్రకారం మార్కె టింగ్‌శాఖ ఉద్యోగుల సమక్షంలో ఓపెన్ మార్కెట్‌లో మామిడి యాక్షన్ జరగాల్సి ఉంటుంది. ఏ రైతు..ఎంత మామిడి సరుకు తీసుకువస్తున్నారు.. ఏ కమీషన్ ఏజెంట్లు ఓపెన్ మార్కెట్‌లో అధిక ధర పలికి ఎంత సరుకు కొనుగోలు చేస్తున్నాడు.. రైతులకు రశీదులు... నగదు సరిగా ఇస్తున్నారా.. లేదా అని పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు నిర్ల క్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు న్నాయి. మార్కెట్‌లో కాంటా వేయడానికి వసతి లేకపోవ డంతో రైతులు ప్రైవేటు కాంటాలను ఆశ్రయిస్తున్నారు. మార్కెట్‌కు సమీపంలో ఉన్న ఓ ప్రైవేటు ధర్మకాంట వద్ద తూకం వేస్తున్నారు. దీనికి గతంలో రూ.40 నుంచి రూ.50 వసూలు చేయగా ప్రస్తుత సీజన్‌లో రూ.80 వరకు వసూలు చేస్తున్నారని రైతులు వాపోతున్నారు.

జిల్లాలో సాగు ఇలా..

ఉమ్మడి జిల్లాలో సుమారు 75 వేల ఎకరాల్లో మామిడి సాగు అవుతుండగా జగిత్యాల జిల్లా వ్యాప్తంగా 40 వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ఇందులో అధికంగా జగిత్యాల, కోరుట్ల నియోజకవర్గాల్లో మామిడి తోటలున్నాయి. స్థానిక రకాలతో పాటు బంగినపల్లి, దశేరి, హిమాయత్, చిన్న రసాలు, పెద్ద రసాలు, తోతాపురి తదితర రకాలను రైతులు సాగు చేస్తున్నారు. జగిత్యాల మామిడికి ప్రత్యేక గుర్తింపు ఉండడంతో ఇక్కడి పండ్లకు ఢిల్లీ, పుణే, ముంబై, నాగ్‌పూర్ తదితర ప్రాంతాల్లో సైతం గిరాకీ ఉంటుంది. సారవంతమైన ఎర్ర గరప నేలలు, మామిడి కాపు సమయంలో అధిక ఉష్ణోగ్రతలు, పొడి వాతావరణం, గాలిలో తేమ శాతం అతి తక్కువగా ఉండడం, నేలల్లో పొటాష్ తదితర పోషకాలు సమృద్ధిగా ఉండడం, సాగునీటి వసతి, చీడపీడల తీవ్రత తక్కువగా ఉండడం తదితర కారణాలతో జగిత్యాల మామిడికి రుచి, నాణ్యత రీత్యా విపరీతమైన డిమాండ్ ఉంది.

ఢిల్లీ వ్యాపారులతో కుమ్మక్కు

కొన్నేళ్ల క్రితం వరకు జగిత్యాల రైతులు మామిడి పంట అమ్ముకునేందుకు ఇతర ప్రాంతాలకు వెళ్లేవారు. 2005లో జగిత్యాలలో మార్కెట్ ఏర్పాటు చేసిన తర్వాత జిల్లా నుంచే కాకుండా నూతనంగా ఏర్పడిన 10 జిల్లాల నుంచి ఈ మార్కెట్‌కు రైతులు మామిడి కాయలను తీసుకువస్తున్నారు. ప్రతీ యేడాది దాదాపు 60 నుంచి 70 టన్నుల మామిడి కాయలు వస్తుంటాయి. జగిత్యాలలో ప్రైవేటు వ్యాపారులు, కమీషన్ ఏజెంట్లు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంతో రైతులకు కొంత మేర ఉపశమనం లభించింది. అయితే స్థానిక వ్యాపారులు, కమీషన్ ఏజెంట్లు కూడా ఢిల్లీ వ్యాపారులతో కుమ్మక్కై ధరలు అమాంతం తగ్గించేస్తున్నారు. ప్రతీ సంవత్సరం సీజన్ ప్రారంభంలో కొన్ని రోజులు అధిక ధరలు పెట్టి ఆ తర్వాత ధరలను తగ్గించేస్తున్నారు. దీంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. ఈ సమస్యను పరిష్కారాన్ని మార్కెటింగ్ అధికారులు శ్రద్ధ చూపడం లేదు. ప్రస్తుత సీజన్‌కు ముందు కిలోకు రూ.100కు పైగా ఉన్న ధరలు, సీజన్ ఆరంభ సమయంలో రూ.70 నుంచి రూ. 80 వరకు పలికాయి. ప్రస్తుత కిలో రూ.35 నుంచి రూ.40 వరకు మంచి రకం మామిడి, రూ.20 నుంచి రూ.30 వరకు ఇతర రకం మామిడికి ధరలు పలుకుతున్నాయి. హైదరాబాద్ గడ్డి అన్నారం, ఢిల్లీ, కరీంనగర్ మార్కెట్‌లతో పోలిస్తే జగిత్యాల మార్కెట్‌లో క్వింటాలుకు రూ.1000 నుంచి రూ.200వ వరకు ధరలు తక్కువగా పలుకుతు న్నాయని రైతులు అంటున్నారు.

కమీషన్ పద్ధతిలోనే అధిక కొనుగోళ్లు

జగిత్యాల మార్కెట్‌లో ఓపెన్ యాక్షన్ ద్వారా కొనుగోలు చేస్తున్నామని అధికారులు, వ్యాపారులు అంటున్నప్పటికీ అధిక కొనుగోళ్లు కమీషన్ పద్ధతిలోనే జరుగుతున్నాయి. మామిడి కాయల కొనుగోలుకు లైసెన్స్ తీసుకున్న కమీషన్ ఏజెంట్లు మార్కెట్‌లోని షెడ్లల్లో కౌంటర్లు ఏర్పాటు చేసుకున్నారు. రైతులు తాము పండించిన మామిడి కాయల రకాలను తెచ్చి వ్యాపారులకు చూపిస్తే వారు ధర నిర్ణయిస్తున్నారు. కాయలు, రేటు నచ్చితే అక్కడే తూకం వేయిస్తారు. ఈ పద్ధతిలో తమకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, వ్యాపారులు ఇష్టారీతిన ధర నిర్ణయిస్తుండడంతో తమకు నష్టం వాటిల్లుతుందని రైతులు వాపోతున్నారు. తొలుత శాంపిల్

అధికారుల పర్యవేక్షణ కరువు

జవ్వాజి గంగాధర్, మామిడి రైతు, తిమ్మాపూర్



జగిత్యాల మార్కెట్‌లో మామిడి కొనుగోలు ఓపెన్ యాక్షన్ ద్వారా నామమాత్రంగానే జరుగుతున్నాయి. మార్కెట్ మొత్తంలో సుమారు 90 మంది వరకు కమీషన్ ఏజెంట్లు ఉండగా ఒకరిద్దరు మాత్రమే ఓపెన్ యాక్షన్‌లో భాగస్వామ్యం అవుతున్నారు. ఓపెన్ యాక్షన్‌ను పర్యవేక్షిం చాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. ఎక్కువగా మామిడి కొను గోళ్లు కమీషన్ పద్ధతిలోనే జరుగుతున్నాయి. క్యాష్ కటింగ్, కమీషన్ కటింగ్ పేరుతో సుమారు 20 శాతం వరకు కోతలు పెడుతున్నారు. నాణ్యత గల మామిడిని మార్కెట్‌కు తీసుకు వచ్చినప్పటికీ ధరలు సరిగా రావడం లేదు.

ఫిర్యాదులు వస్తే విచారణ చేపడతాం

ప్రకాశ్, మార్కెటింగ్ శాఖ జిల్లా అధికారి, జగిత్యాల



చల్‌గల్ మామిడి మార్కెట్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలిగినా ఫిర్యాదు చేస్తే విచారణ జరిపి అవసరమైన చర్యలు తీసుకుంటాం. ఓపెన్ యాక్షన్ ద్వారా అమ్మకాలు జరపాల్సి ఉంటుంది. వ్యాపారులు సిండికేట్ కావడం, ధరలు తగ్గించడం వంటివి జరపకూడదు. మార్కెట్‌లో రైతులకు అవసరమైన వసతులను సమకూర్చాం. రాష్ట్రంలోని హైద్రాబాద్ గడ్డి అన్నారం, కరీంనగర్ వంటి మార్కెట్లలో ఉన్న మామిడి ధరల పట్టికను ప్రతి రోజు జగిత్యాల యార్డులో ప్రదర్శిస్తున్నాం. రైతులు మామిడి విక్రయించిన తర్వాత కమీషన్ ఏజెంట్, వ్యాపారి వద్ద నుంచి రశీదును తీసుకోవాలి.

ఉమ్మడి కరీంనగర్ అభివృద్ధికి నిధులు ఇవ్వండి

కేంద్ర మంత్రులకు బండి సంజయ్ వినతి


కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్‌సింగ్ గజేంద్ర సింగ్ షెకావత్‌ను కలిసిన బండిసంజయ్‌కుమార్

భగత్‌నగర్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పలు ప్రాంతాల అభివృద్ధికి నిధులు కేటాయించాలని కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, గజేంద్రసింగ్ షెకావత్‌లకు ఢిల్లీలో బుధవారం కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేములవాడ, కొండగట్టు, ఇల్లందకుంట ప్రాంతాల అభివృద్ధికి నిధులు కేటాయించాలన్నారు. రాష్ట్రాలకు మూలధన పెట్టుబడి కోసం ప్రత్యే సాయం (ఎస్ఎఎస్‌సిఐ) పథకం కింద నిధులు మంజూరు చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన గజేంద్ర సింగ్ షెకావత్ ఈ విషయంపై పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారని తెలిపారు. సిరిసిల్ల లేదా సిద్దిపేట జిల్లాలోని హుస్నాబాద్‌లో సైనిక్ స్కూల్ ఏర్పాటు చేయాలని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను కలిసి వినతి పత్రం అందించారు. కేంద్రం సైనిక్ స్కూల్ మంజూరు చేస్తే భూమి, మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ సిరిసిల్ల, హుస్నాబాద్‌లో సైనిక్ స్కూల్ ఏర్పాటు అవకాశాలపై తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్ తెలిపారు.

కార్మికచట్టాలు, హక్కులను కాలరాస్తున్న బీజేపీ ప్రభుత్వం

లేబర్ కోడ్‌ల రద్దుకోసం కార్మికులు పోరాటానికి సన్నద్ధం కావాలి

మే 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : కార్మిక చట్టాలతోపాటు వారి హక్కులను కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కాలరాస్తోందని, కార్మిక వ్యతిరేక 4లేబర్ కోడ్‌లను రద్దుచేయాలంటూ కార్మికులు పోరాటానికి సన్నద్ధం కావాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్ కోరారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని శివనగర్‌లో బుధవారం సీఐటీయూ అనుబంధ రంగాలు, యూనియన్‌ల ముఖ్య నాయకులతో వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌నకు ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందన్నారు. బడా పెట్టుబడి దారులకు, కార్పొరేట్లకు కొమ్ముకాసే విధంగా కార్మికవర్గం పోరాడి సాధించుకున్న 29కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మిక చట్టాలు, హక్కులను కాలరాస్తోందని మండిపడ్డారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక 4లేబర్ కోడ్‌ల రద్దుకు దేశంలోని అన్ని జాతీయ,ప్రాంతీయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా మే 20న చేపట్టే సార్వత్రిక సమ్మెలో జిల్లాలోని కార్మికులు పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యులు కోటం రాజు, జిల్లా అధ్యక్షుడు ఎగుమంటి ఎల్లారెడ్డి, జిల్లా కార్యదర్శి కోడం రమణ, ఉపాధ్యక్షుడు మూషం రమేష్, గుర్రం అశోక్, అన్నల్‌దాస్ గణేష్, గురజాల శ్రీధర్, సూరం పద్మ, మిట్టపల్లి రాజమల్లు, గీస భిక్షపతి, మల్యాల నర్సయ్య, సిరిమల్ల సత్యం, జిందం కమలాకర్, రమేష్‌చంద్ర, భారతి, లక్ష్మీ, శ్రీనివాస్, రవి, సురేష్, శేఖర్, రాజు, రమేష్ శ్రీధర్, నర్సయ్య, రాజెల్లయ్య, కుమార్, దేవరాజు, బాబాకిషన్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


సిరిసిల్లలో సీఐటీయూ జిల్లా వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి రమేష్

సోషల్ మీడియాలో వచ్చే సమాచారాన్ని సరిచూసుకోవాలి



రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ కె శ్రీనివాస్ రెడ్డి

వేములవాడ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : సోషల్ మీడియాలో వస్తున్న సమాచారాన్ని ఒకటికి రెండుసార్లు సరిచూసుకొని వార్తలు రాయాలని రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ కే శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. వేములవాడ పట్టణంలో నిర్మించిన ప్రెస్ క్లబ్ అదనపు సమావేశ మందిరాన్ని స్థానిక శాసన సభ్యుడు, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టులు నిజాలను వెలికి తీసే వార్తలు రాయాలని, ప్రెస్ క్లబ్‌లు జర్నలిస్టుల వృత్తి నైపుణ్యాలను పెంచే కేంద్రాలుగా, ప్రజల సమస్యల పరిష్కారానికి వేదికలుగా మారాలన్నారు. ప్రస్తుతం కమ్యూనికేషన్ వ్యవస్థ చాలా పెరిగిందని, 30 ఏళ్లుగా ప్రింట్, ఎలక్ట్రానిక్ మెయిన్ స్ట్రీమ్ మీడియా మొదలుకొని నేడు సోషల్ మీడియా విప్లవం వరకు వచ్చిందని, అయినప్పటికీ సోషల్ మీడియాను వ్యతిరేకించాల్సిన పనిలేదన్నారు.

మెయిన్ స్ట్రీమ్ మీడియాకు జబ్బులు అంటుకున్న విషయాన్ని ప్రజలు చర్చించుకుంటున్నారని, సమాచార వ్యవస్థ ప్రజలకు సరైన సమాచారాన్ని, వాస్తవాలను అందించాలని కోరారు. ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాలో నీతి, నియమాలకు అనుగుణంగా పనిచేసే వ్యవస్థ ఉంటుందని, వృత్తి అనుభవం ఉన్న వారు గేటు కీపర్ వ్యవస్థ ఉందని, కానీ సోషల్ మీడియాకు గేట్ కీపర్ వ్యవస్థ లేదన్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఏఐతో చేసిన చిత్రాలను చూసి జనాలు చలించిపోయారని, ఏఐ నుంచి ప్రజలను రక్షించడం ఒక ఎత్తని, జర్నలిస్టులుగా వాస్తవాలను తెలుసుకోకుండా సోషల్ మీడియాలో వస్తున్న విషయాలను ఫార్వర్డ్ చేస్తున్నామని, అలా అయితే కేసులు తప్పవని, ఏఐతో జర్నలిస్టులు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. వర్కింగ్ జర్నలిస్టుల నైపుణ్యాన్ని పెంచడానికి ప్రెస్ క్లబ్‌లు కృషి చేయాలనీ, సోషల్ మీడియాలో వస్తున్న విషయాలను ఫ్యాక్ట్ చెక్ ఎలా చేయాలో నేర్పించేందుకు ప్రెస్ అకాడమీ సిద్ధంగా ఉందని, అవసరమైతే ఫాక్ట్ చెక్ కోసం వేములవాడలో రెండు రోజుల పాటు ట్రైనింగ్ ఇవ్వడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధులు జర్నలిస్టులు

రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

జర్నలిస్టులు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధులు అని వేములవాడ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ ప్రెస్ క్లబ్ అదనపు సమావేశ మందిరం ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రెస్‌క్లబ్ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని, అర్హులైన జర్నలిస్టులందరికీ త్వరలోనే ఇళ్ల స్థలాలు మంజూరు అయ్యేలాగా చూస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ, జిల్లా అధ్యక్షుడు దండి సంతోష్ కుమార్, ప్రధాన కార్యదర్శి కాంబోజ ముత్యం, వేములవాడ మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, వేములవాడ ప్రెస్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరి ఆత్మహత్య

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం తీగలగుట్టపల్లి విద్యారణ్యపురి కాలనీలో ఆర్థిక ఇబ్బందులతో ఎలుకోరు సురేందర్ రెడ్డి(45) బుధవారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు కరీంనగర్ రూరల్ పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. సురేందర్‌రెడ్డి కరీంనగర్ సెవెన్‌హిల్స్ ప్రాంతంలో వాటర్ ప్యూరిఫై షాపును నిర్వహిస్తున్నాడు. భార్య మంథని జేఎన్‌టీయూలో ఉద్యోగం చేస్తోంది.

ఉదయం భార్యను మంచిర్యాల బస్టాప్, చిన్న కూతురును స్కూల్‌లో వదిలిపెట్టిన సురేందర్‌రెడ్డి ఇంటికి చేరుకున్నాడు. కూతురు మధ్యాహ్నం ఇంటికి వచ్చి చూసేసరికి సురేందర్‌రెడ్డి ఉరికి వేళాడుతూ కనిపించాడు. జేబులో ఒక సూసైడ్ నోట్ లభించింది. వ్యాపారంలో నష్టం, అప్పుల బాధతో బలవన్మరణానికి పాల్పడుతున్నట్లు పేర్కొన్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉరేసుకొని చేనేత కార్మికుడు..

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతోపాటు మానసిక సమస్యలతో బాధపడుతున్న కరీంనగర్ రూరల్ మండలం జూబ్లీ నగర్‌కు చెందిన ఉడుత సుధాకర్ ఉరేసు కొని ఆత్మహత్య చేసుకున్నట్లు కరీంనగర్ రూరల్ పోలీసులు తెలిపారు. మద్యానికి బానిసగా మారిన సుధాకర్‌కు మానసిక వైద్యుడి వద్ద చికిత్స అందిస్తున్నారు. మంగళవారం ఇంటి వద్ద ఒంటరిగా ఉన్న సమయంలో పవర్‌లూమ్స్ షెడ్‌లో ఉరేసుకున్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

పసుపు బోర్డుకు చట్టబద్ధత కల్పించలేదు

- బడ్జెట్‌లో ఒక్క రూపాయి కేటాయించలేదు
- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

జగిత్యాల, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): పసుపు బోర్డుకు చట్టబద్ధత కల్పించలేదని, దీనివల్లే బోర్డుకు బడ్జెట్‌లో ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని నిజామాబాద్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో బుధవారం బీఆర్ఎస్ వరంగల్ రజతోత్సవ సన్నాహక సమావేశానికి ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. పసుపు బోర్డు తెచ్చామని చెబుతున్న బీజేపీ, కేవలం గెజిట్ ఇచ్చి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. పసుపు ధరలు పడిపోతే బోర్డు నుంచి రైతులకు డబ్బులు ఇస్తామని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ చెప్పారని, ఇప్పుడు ఎందుకు ఇవ్వడం లేదని ఆమె ప్రశ్నించారు. బీజేపీ ప్రకటించిన విధంగా రెండు కోట్ల ఉద్యోగాలు, పసుపు బోర్డుకు చట్టబద్ధత గురించి తాము అడిగితే నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ పిచ్చి మాటలు మాట్లాడుతున్నారన్నారు.

రాష్ట్రం నుంచి 8 మంది కాంగ్రెస్ ఎంపీలు, 8 మంది బీజేపీ ఎంపీలు ఉన్నా కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు కనీసం ఎనిమిది రూపాయలు కూడా ఇవ్వలేదని ఆమె ఎద్దేవా చేశారు. కాంగ్రెస్, బీజేపీ చెప్పే మాయమాటలను బీఆర్ఎస్ కార్యకర్తలు ప్రజలకు వివరించాలని కవిత పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ రజతోత్సవం గులాబీ పండగ మాత్రమే కాదని, తెలంగాణ పండగ అని చెప్పుకొచ్చారు. కల్యాణ లక్ష్మి పథకం కింద తులం బంగారం ఇస్తామని చెప్పి సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలను మోసం చేశారన్నారు. రుణ మాఫీ, రైతు భరోసా 50 శాతం మం దికి ఇప్పటికీ రాలేదన్నారు. ఫ్రీబస్ ఇస్తే బస్సులు పెంచాలా లేదా అని ఆమె ప్రశ్నించారు. తెలంగాణను కాపాడేది కేవలం బీఆర్ఎస్ మాత్ర మేనని కవిత స్పష్టం చేశారు.

జగిత్యాల ఎమ్మెల్యే ఏ పార్టీలో ఉన్నాడో అర్థం కావడం లేదు..

గత శాసనసభ ఎన్నికల్లో బీఆర్ఎస్ గుర్తుపై గెలిచిన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్ ప్రస్తుతం ఏ పార్టీలో ఉన్నడో ప్రజలకు అర్థం కావడం లేదని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. ఆయన ప్రస్తుతం బీఆర్ఎస్ లోనైతే లేడన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ఒకసారి, బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్‌తో ఢిల్లీలో మరోసారి వార్తల్లో కనిపిస్తు న్నాడని విమర్శించారు. బీఆర్ఎస్ చేయి పట్టి నడిపిస్తే సంజయ్ ఎమ్మెల్యే అయ్యాడన్నారు.

ఇటీవల జరిగిన ఓ సర్వేలో జగిత్యాల ఎమ్మెల్యేకు 108వ ర్యాంకు వచ్చిందన్నారు. రోళ్లవాగు ప్రాజెక్టు కడితే 18 నెలల్లో కనీసం గేటు పెట్టలేని అసమర్థ ప్రభుత్వం కాంగ్రెస్ అని విమర్శించారు. ఈనెల 27న వరంగల్‌లో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేశారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభకు క్యాడర్‌ను ఆహ్వానిస్తూ జగిత్యాల తెలంగాణ చౌరస్తాలో నిజామాబాద్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత వాల్ రైటింగ్ చేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు కొప్పుల ఈశ్వర్, రాజేశంగౌడ్, ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్, ఎమ్మెల్సీ ఎల్ రమణ, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత సురేశ్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు తదితరులు ప్రసంగించారు. జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి, వేములవాడ, చొప్పదండి తదితర నియోజకవర్గాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



జగిత్యాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

కొనుగోలు కేంద్రానికి స్థల పరిశీలన

చందుర్తి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండల కేంద్రంలో శివారులోని అటవీ ప్రాంతంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు కోసం వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ బుధవారం స్థలాని పరిశీలించారు. మండల కేంద్రం నుండి మోత్కురావుపేటకు వెళ్లే రహదారి పక్కన గల సర్వేనెంబర్ 176లో రైతులకు వరి ధాన్యం కొనుగోలు కోసం దాదాపు 6 ఎకరాల స్థలాన్ని పరిశీలించడం జరిగిందని తాసిల్దార్ శ్రీనివాస్ తెలిపారు. ఆయన వెంట సీఐ వెంకటేశ్వర్లు ఎస్సై అంజయ్య, మండల కాంగ్రెస్ నాయకులు, రైతులు ఉన్నారు.

గావ్ చలో.. బస్తీ చలో..

రుద్రంగి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి) మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో గావ్ చలో.. బస్తీ చలో అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జీ చెన్నమనేని వికాస్‌రావు హాజరై మాట్లాడారు. ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడే నంద్యాడపు వేంకటేష్, పడాల గణేష్, బోయిని రాజు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందించాలి

కోనరావుపేట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : పిల్లలకు పౌష్టికాహారం అందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కనకమ్మ అన్నారు. కోనరావుపేట మండలం కొలనూరులో పోషణపక్షం కార్యక్రమాన్ని నిర్వహించారు. పిల్లల బరువును పరీక్షించి తక్కువ బరువు ఉన్న పిల్లలకు ఆహారం ఎలా అందించాలనే విషయంపై సూచించారు. అంగన్‌వాడీ టీచర్లు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

● ఇల్లంతకుంట (ఆంధ్రజ్యోతి): గర్భిణులు సమతుల్య ఆహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ చంద్రకళ సూచించారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీజన్లో లభించే కూరగాయలు, పండ్లను తీసుకోవాలన్నారు. పల్లీలు, బెల్లం, రాగులు కలిపి తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉంటామన్నారు. బయట లభించే జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండాలన్నారు. సెక్టార్‌లోని అంగన్‌వాడీ టీచర్లు, తల్లులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు తారురోడ్డుకు మోక్షం..

- పల్లిమక్త-నాగారం గ్రామాల మధ్య మొదలైన పనులు - వాహనదారులకు తప్పిన తిప్పలు

కోనరావుపేట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : కొన్ని సంవత్సరాలుగా తారు రోడ్డు నిర్మాణం కోసం ఎదురుచూస్తున్న మండల వాసులకు వారంరోజుల క్రితం తారు నిర్మాణం చేపట్టడంతో మండలవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కోనరావుపేట మండలంలోని పల్లిమక్త, నాగారం గ్రామాల మధ్య రెండు కిలోమీటర్లు తారు రోడ్డు లేకపోవడంతో గుంతలమయంగా మారి ప్రజలు, వాహనదారులు ఇబ్బంది పడ్డారు. పది సంవత్సరాల క్రితం వేములవాడ నంది కమాన్ నుంచి మారుపాక, సుద్దాల, పల్లిమక్త వరకు గత ప్రభుత్వం డబుల్ తారు రోడ్డు నిర్మాణం చేపట్టి పూర్తి చేశారు. పల్లిమక్త నుంచి నాగారం వరకు సుమారు రెండు కిలోమీటర్లు తారు రోడ్డు నిర్మించకుండా వదిలేశారు. ఎన్నిసార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోయింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దృష్టికి ప్రజలు తీసుకపోవడంతో స్పందించిన ఆయన తారు రోడ్డు నిర్మాణం చేయాలని అధికారులు ఆదేశించారు. దీంతో వారం రోజుల క్రితం తారు రోడ్డు నిర్మాణం పనులు చేపట్టారు.

దీంతో మండల వాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు



పల్లిమక్త-నాగారం మధ్య ప్రారంభమైన తారు రోడ్డు నిర్మాణం పనులు

తారు రోడ్డు కోసం పదేళ్లుగా ఎదురుచూస్తునాం..

- ఉప్పుల గంగయ్య, సుద్దాల



తారు రోడ్డు నిర్మాణం చేపట్టకపోవడంతో వర్షాకాలంలో గుంతలమయంగా మారి వాహనాలు వెళ్లడం ఇబ్బందికరంగా మారింది. పదేళ్లుగా తారు రోడ్డు నిర్మాణం కోసం ఎదురుచూస్తున్నాం. ఎమ్మెల్యే స్పందించి పనులు ప్రారంభించడం సంతోషంగా ఉంది.

త్వరలో పెండింగ్ రోడ్ల నిర్మాణ పనులు..

- కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి



మండలంలో మిగిలిపోయిన రోడ్లన్నీ ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ సహకారంతో పనులు చేపడతాం. ఇప్పటికే నాగారం, పల్లిమక్త తారురోడ్డు నిర్మాణం చేపట్టాం. త్వరలో మంగళపల్లి-సుద్దాల ఎక్స్‌రోడ్డు,సుద్దాల-రామన్నపేట తారురోడ్డు నిర్మాణ పనులు చేపడుతాం.

రుణ పరిమితి ఖరారు

(5వ పేజీ తరువాయి)

రూ.10.80 కోట్లు, ఇంధన రంగానికి రూ.31.10 కోట్లు, ఇతర విభాగాలకు రూ.33.50 కోట్లు లక్ష్యంగా పెట్టుకున్నారు.

వానాకాలం సీజన్‌లో 2.42 లక్షల ఎకరాల్లో సాగు

జిల్లాలో వానాకాలం సీజన్‌లో గత సంవత్సరం 2.42 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. ప్రస్తుత యాసంగిలో 1.80 లక్షల ఎకరాల్లో రైతులు సాగు చేస్తున్నారు. ఇందులో వానాకాలం సీజన్‌లో వరి 1.60 లక్షల ఎకరాలు, పత్తి 49,332 ఎకరాల వరకు సాగు చేస్తున్నారు. యాసంగిలో వరి 1.78 లక్షల ఎకరాల్లో రైతులు సాగు చేస్తున్నారు. ప్రస్తుతం యాసంగి సీజన్‌లో కొనుగోళ్లు కూడా ప్రారంభమయ్యాయి.

ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపికపై సమావేశం

గంబీరావుపేట ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను గుర్తించేందుకు మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక అధికారి రాఘవేంద్రరావు గ్రామపంచాయతీ కార్యదర్శులతో ఇందిరమ్మ కమిటీ సభ్యులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి అర్హులైన లబ్ధిదారులను గుర్తించేందుకు మండలంలోని అన్ని జపీల ఇందిరమ్మ కమిటీ మెంబర్లకు మండల పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో ప్రత్యేక అధికారి రాఘవేంద్రరావు, ఎంపీఓ రాజశేఖర్, మండల ఇందిరమ్మ ఇండ్ల కమిటీ మెంబర్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వేములవాడలో అద్దె గదుల తనిఖీ



అద్దె గదిని తనిఖీ చేస్తున్న పోలీసులు

వేములవాడ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ పట్టణంలోని ప్రైవేట్ లాడ్జీలు, అద్దె గదులను పోలీసులు బుధవారం రాత్రి తనిఖీ చేశారు. పట్టణ సీఐ వీరప్రసాద్ ఆధ్వర్యంలో సుమారు 50 మంది పోలీసులు బృందాలుగా విడిపోయి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రైవేటు లాడ్జీలు, అద్దె గదుల నిర్వాహకులు తగిన ధ్రువీకరణ పత్రాలు ఇచ్చిన వారికి మాత్రమే గదులు అద్దెకు ఇవ్వాలన్నారు. గదుల్లో ఎలాంటి చట్ట వ్యతిరేక కార్యక్రమాలు జరగకుండా జాగ్రత్త పడాలని సూచించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీల్లో వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్, చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సైలు మారుతి, వెంకట్రాజం, రమేష్ పాల్గొన్నారు.

రైల్వే లైన్ నిర్వాసితులకు పెండింగ్ పరిహారం చెల్లించాలి

సిరిసిల్ల కలెక్టరేట్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి-మనోహరాబాద్ రైల్వేలైన్ భూసేకరణ పెండింగ్ పరిహారం త్వరగా చెల్లించాలని క్యాబినేట్ సెంట్రల్ సెక్రెటరీ కలెక్టర్‌కు సూచించారు. కలెక్టరేట్‌లో బుధవారం జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఢిల్లీ నుంచి సెంట్రల్ సెక్రెటరీ కొత్తపల్లి-మనోహరాబాద్ అభివృద్ధి పనుల్లో పెండింగ్ భూసేకరణ పరిహారం చెల్లింపుల స్థితిగతులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. మనోహరాబాద్ నుంచి కొత్తపల్లి వరకు 151 కిలోమీటర్ల రైల్వేలైన్ అభివృద్ధి పనుల్లో భాగంగా భూసేకరణ పెండింగ్ పరిహారం చెల్లింపులు సంబంధిత లబ్ధిదారులకు అందించాలని వివరించారు. సిద్ధిపేట, మెదక్, కరీంగనర్, సిరిసిల్ల జిల్లాలను సికింద్రాబాద్ రైల్వేలైన్ కలపడం వల్ల పారిశ్రామికంగా ఈ ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని మనోహరాబాద్ నుంచి గజ్వేల్ వరకు 32కిలోమీటర్లు, గజ్వేల్ నుంచి సిద్ధిపేట వరకు 40 కిలోమీటర్లు, సిద్ధిపేట నుంచి సిరిసిల్లకు 40.80కిలోమీటర్లు, సిరిసిల్ల నుంచి కొత్తపల్లికి 39 కిలోమీటర్ల రైల్వే లైన్ పనులు నాలుగు దశలో చేయడం జరుగుతుందని ప్రస్తుతం రెండవ దశ పనులు జరుగుతున్నాయని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా మాట్లాడుతూ రైల్వే లైన్‌కు సంబంధించి సిరిసిల్ల జిల్లాలో 40 కిలోమీటర్ల మేర ఉందని దీనికి సంబంధించి 386.21 హెక్టార్ల భూసేకరణ చేయాల్సిఉండగా ప్రస్తుతం 342.46 హెక్టార్ల భూమిని సేకరించి రైల్వే శాఖకు బదిలీ చేశామని అన్నారు. పెండింగ్‌లో ఉన్నా 43.42 హెక్టార్ల భూ సేకరణలో భాగంగా 15.21 హెక్టార్ల రిజర్వ్ ఫారెస్ట్ భూమిని రైల్వే శాఖకు అప్పగించామని దానికి బదులు అటవీశాఖకు కోనరావుపేట మండలంలోని కొండాపూర్‌లో 38ఎకరాల 5గుంటల భూమిని అందించామన్నారు. పెండింగ్ భూసేకరణకు 68.80కోట్లు పీడీ అకౌంట్‌లో జమ అయ్యాయని భూనిర్వాసితులకు పరిహారం చెల్లింపు కోసం రాష్ట్ర ప్రభుత్వ ఆమోదం కోసం వేచి చూస్తున్నామనిన్నారు. పరిశ్రమల శాఖ జీఎం హన్మంతు నాయక్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ శ్రీకాంత్ పాల్గన్నారు.



కలెక్టరేట్‌లో రైల్వే అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

సంక్షిప్త సమాచారం

వైభవంగా సీతారాముల కల్యాణం

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లతిమ్మాపూర్‌లోని సీతారామచంద్రస్వామి ఆలయ వార్షికోత్సవాలు బుధవారం ఘనంగా జరిగాయి. ఉదయం ఆలయంలో పురోహితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో ప్రత్యేక పందిరిని వేసి అలంకరించారు. వేద మంత్రోచ్ఛరణల నడుమ సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా జరిపించారు. మహిళలు మంగళహారతులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

లబ్ధిదారుల ఎంపికను పారదర్శకంగా చేపట్టాలి

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పారదర్శకంగా చేపట్టాలని మండల ప్రత్యేక అధికారి అఫ్జల్‌బేగం అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల పరిషత్తు కార్యాలయంలో గ్రామ ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులతో బుధవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అధికారి అఫ్జల్‌బేగం మాట్లాడుతూ గ్రామాల్లో దరఖాస్తు చేసుకున్న నిరుపేదల ఇళ్ల ఎంపికను ప్రభుత్వ నిబంధనల మేరకు పూర్తిచేయాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ సుజాత, ఎంపీవో రాజు, ఆయా గ్రామాల ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ భవన నిర్మాణాలకు భూమి పూజ

తంగళ్లపల్లి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) తంగళ్లపల్లి మండలం జిల్లెల్లలో అంగన్‌వాడీ కేంద్రాల భవన నిర్మాణానికి నాయకులు, భూమి పూజచేశారు. రూ.12లక్షల చొప్పున వ్యయంతో నిర్మిస్తున్న రెండు అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణానికి బుధవారం భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమాల్లో ప్యాక్స్ చైర్మన్ కోడూరి భాస్కర్‌గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జల్గం ప్రవీణ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఇట్టిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం అనురాధ, నాయకులు పబ్బతి కృష్ణారెడ్డి, మునిగేల రాజు, ఆసరి బాలరాజ్, లింగారెడ్డి, తిరుపతిగౌడ్, మనోజ్, నర్సింహులు, అనిల్‌రెడ్డి అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ, పెద్దమ్మ బోనాల జాతర

కోనరావుపేట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండలం ధర్మారంలో ముదిరాజుల సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మ, పోచమ్మ బోనాల పండుగను బుధవారం ఘనంగా నిర్వహించారు. ముదిరాజుల ఆరాధ్య దైవమైన పెద్దమ్మ తల్లి బోనాల జాతరలో భాగంగా పోచమ్మ తల్లికి బోనాలను చెల్లించారు.

చెక్కుల పంపిణీ

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్, హరిదాస్‌నగర్ గ్రామాల్లో ప్రమాద బీమా, సీఎంఆర్ఎఫ్ చెక్కును నాయకులు బుధవారం అందజేశారు. రాచర్లబొప్పాపూర్‌లో రెండేళ్ల క్రితం బెస్త నీలవ్వ విద్యుదాఘాతంతో మృతిచెందగా బాధిత కుటుంబానికి సెస్ ద్వారా మంజూరైన రూ.5లక్షల ప్రమాద బీమా చెక్కును పంపిణీ చేశారు. హరిదాస్‌నగర్‌లో లబ్ధిదారులకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ కృష్ణహరి, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, తాజా, మాజీ జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, నాయకులు భీమేశ్వర్, నర్సింహారెడ్డి, వసంత్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, సత్యం, సతీష్, దేవరెడ్డి, శివరాములు, చంద్రం, నాగరాజు, రాజయ్య, మహేశ్, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నాటక ప్రదర్శన

చందుర్తి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : చందుర్తి మండల కేంద్రంలో సాదు సజ్జన భజన మండలి కళాకారులు శ్రీమద్విరాట్ వీర బ్రహ్మేంద్ర స్వామి చరిత్ర నాటకాన్ని మంగళవారం రాత్రి ప్రదర్శించారు. ఈసందర్భంగా నాటక ప్రదర్శనలో బ్రహ్మంగారి జననం, ఆయన వృత్తి, ఇతర కాలజ్ఞాన ఘట్టాన్ని చూపించారు. మాదిగ కక్కయ్య, పోశవ్వల నాటకం అందరినీ అలరించింది.

లబ్ధిదారుల ఎంపికపై సమావేశం

ఇల్లంతకుంట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ళ లబ్ధిదారుల ఎంపికపై మండలపరిషత్ కార్యాలయంలో బుధవారం సమీక్షా సమావేశం జరిగింది. ఈసందర్భంగా ప్రత్యేకాధికారి రామకృష్ణ మాట్లాడుతు మండలానికి 803 ఇళ్ళు మంజూరు అయినవని, గ్రామాలలో ఉండే ఇందిరమ్మ కమిటీ సభ్యులకు అర్హుల జాబితా ఇవ్వడం జరుగుతుందని, వీటిలో ప్రాధాన్యత క్రమాన ఎంపిక చేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఫారూఖ్, ఎంపీడీవో శశికళలతో పాటు మండలస్థాయి అధికారులు, ఇందిరమ్మ కమిటీల సభ్యులు పాల్గొన్నారు.

మండల వైద్యాధికారి క్యాన్సర్‌తో మృతి

చందుర్తి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : చందుర్తి మండల వైద్యాధికారి డాక్టర్ వేద చారి(30) బుధవారం ఉదయం అనారోగ్యంతో మృతిచెందారు. వైద్య సిబ్బంది కథనం ప్రకారం.. వేదచారి గత కొంతకాలంగా క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. ఇటీవల హైదరాబాదులో బంధువుల ఇంటిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. గత డిసెంబర్‌లో చందుర్తి మండల వైద్యాధికారిగా డాక్టర్ వేదాచారి బాధ్యతలు చేపట్టారు. ఆయన మండల ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న తరుణంలో అనారోగ్యంతో మృతి చెందడం మండల ప్రజలను తీవ్రంగా కలచివేస్తుంది. ఆయన స్వగ్రామం నర్సంపేట మండలంలోని గురజాల గ్రామంకు మృతదేహాన్ని తరలించి నట్లు తెలిపారు. మండల వైద్య సిబ్బంది మృతుని కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తపరిచారు.

పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): పేదల ప్రజల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ మండల కేంద్రంలోని అర్బన్ మండల పరిషత్ కార్యలయంలో బుధవారం పట్టణ, అర్బన్, రూరల్ మండలాలకు చెందిన కల్యాణలక్ష్మీ, షాదిముబారక్, సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ఎవరు ఊహించని విధంగా రాష్ట్ర ప్రభుత్వం పేద, ధనిక అని తేడా లేకుండా అందరికీ సన్న బియ్యం అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు, తహసీల్దార్ విజయ్‌ప్రకాశ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పిల్లి కనుకయ్య, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, సంఘ స్వామి యాదవ్, సంద్రగిరి శ్రీనివాస్, చిలుక రమేష్, పండుగ ప్రదీప్, పుల్కం రాజు, అక్రమ్, దండుగుల తిరుపతి తదితరులున్నారు.

గ్రంథాలయాన్ని సందర్శించిన విప్..

వేములవాడ పట్టణంలోని మండల పరిషత్ ఆవరణలో నూతనంగా నిర్మించిన గ్రంథాలయాన్ని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సందర్శించారు. గ్రంథాలయానికి వచ్చిన పాఠకులతో కాసేపు ముచ్చటించారు.

● చందుర్తి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రైతు వేదికలో అర్హులైన 42 మంది లబ్ధిదారులకు 42లక్షల కల్యాణ లక్ష్మి చెక్కులను, సీఎంఆర్ఎఫ్ చెక్కులను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఏఎంసీ వైస్ చైర్మన్ బొజ్జ మల్లేశం, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చింతపంటి రామస్వామి, మాజీ జడ్పీటీసీ సభ్యుడు నాగం కుమార్, ఏఎంసీ డైరెక్టర్ మర్రి కృష్ణ, నాయకులు ఎన్లంటి శంకర్, లింగంపల్లి సత్తయ్య, లాండే సత్తయ్య, ధర్మపురి శ్రీనివాస్, దూది శ్రీనివాస్ రెడ్డి, కొట్టే ప్రభాకర్, ముసుకు ముకుందరెడ్డి, సొంతపూరి బాలకృష్ణ, బాణాల రవీందర్ రెడ్డి, మల్లారపు రాజయ్య, సాయి, వేల్పుల దేవస్వామి, పులి సత్తయ్య, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

● కోనరావుపేట ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో అర్హులైన 23 మంది లబ్ధిదారులకు 23 లక్షల కల్యాణ లక్ష్మి చెక్కులను, సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేసి, ఇందిరా మహిళా శక్తి కింద ఐకేపీ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ బుధవారం ప్రారంభించారు. అనంతరం నిమ్మపల్లి గ్రామంలోని శ్రీ బీరప్పస్వామి మహోత్సవంలో ప్రభుత్వ విప్ పాల్గొని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు కేతిరెడ్డి జగన్మోహన్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, వైస్‌చైర్మన్ తాళ్లపల్లి ప్రభాకర్, మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా, నాయకులు చేపూరి గంగాధర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు నాయిని ప్రభాకర్ రెడ్డి, మల్లారెడ్డి, నాగరాజు, కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, మానుక సత్యం, పెంతల శ్రీనివాస్, లింబయ్య తదితరులు పాల్గొన్నారు.

'రాజ్యాంగ పరిరక్షణకు కాంగ్రెస్ ప్రయత్నాలు'

ఇల్లంతకుంట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగాన్ని బీజేపీ అవమానిస్తుంటే కాంగ్రెస్ పార్టీ పరిరక్షించడానికి ప్రయత్నిస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఇన్‌చార్జి సూర దేవరాజులు పేర్కొన్నారు. మండలంలోని దాచారం, సిరికొండ, తెనుగువానిపల్లె, అనంతరగిరి గ్రామాల్లో బుధవారం రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రలను కాంగ్రెస్ నాయకులు చేపట్టారు. అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ప్రతిజ్ఞలు చేశారు. మాజీ ఎంపీపీలు రమణారెడ్డి, అయిలయ్య, నాయకులు ఐరెడ్డి మహేందర్ రెడ్డి, పసుల వెంకటి, ప్రసాద్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్సై అటాచ్

చందుర్తి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): చందుర్తి పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఏఎస్సై సతీష్‌ను జిల్లా హెడ్ క్వార్టర్‌కు బుధవారం అటాచ్ చేశారు. సంవత్సర క్రితం చందుర్తి స్టేషన్‌లోనే హెడ్ కానిస్టేబుల్ విధులు నిర్వర్తిస్తున్న సమయంలో అనేక ఆరోపణలతో కోనరావుపేట ఠాణాకు బదిలీ చేశారు. ఏఎస్సై పదోన్నతిపై తిరిగి చందుర్తికి వచ్చారు. ఈనెల 9న సిబ్బందితో కలిసి విందు చేసుకుని ఠాణాల్లో విధులు నిర్వర్తించారన్న ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి.

కాగా, ఈ విషయమై చందుర్తి సీఐ వెంకటేశ్వర్లను వివరణ అడగగా అడ్మినిస్ట్రేషన్ పరంగా జిల్లా అధికారుల ఆదేశాల మేరకు అటాచ్ చేసినట్లు పేర్కొన్నారు.

మిల్లులతో సంబంధం లేకుండా ధాన్యం సేకరణ



రాచర్లబొప్పాపూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్, అడిషనల్ కలెక్టర్



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): రైతుల ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు రైస్‌మిల్లులతో సంబంధం లేకుండా సేకరించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అన్నారు. జిల్లాలో మొత్తం ఐకేపీ ఆధ్వర్యంలోని మహిళా సంఘాల ద్వారా 191 కేంద్రాలను ప్రారంభిస్తున్నామని పేర్కొన్నారు. అన్నదాతలు కేంద్రాల్లోనే విక్రయించి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని సూచించారు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌లోని వ్యవసాయ మార్కెటు కమిటీ ఆవరణలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్, ఏఎంసీ చైర్‌పర్సన్ సబేరాబేగంతో కలిసి బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా మాట్లాడుతూ ధాన్యం అమ్ముకునేందుకు వచ్చే రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. రాగట్లపల్లి, నారాయణపూర్, సింగారం, గుండారం గ్రామాల్లో వరి ధాన్యం కేంద్రాలను డీఆర్‌డీవో శేషాద్రి ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ సబేరాబేగం, మండల ప్రత్యేక అధికారి, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్‌బేగం, తహసీల్దార్ సుజాత, ఐకేపీ ఏపీఎం మల్లేశం,నాయకులు రాంరెడ్డి, నర్సయ్య, లక్ష్మారెడ్డి, లక్ష్మారెడ్డి, రాజేందర్, రవీందర్, గణేశ్‌నాయక్, శ్రీనివాస్, లక్ష్మీ, రాజునాయక్, సాహెబ్, శ్రీనివాస్‌రెడ్డి, మల్లేశం, మహేందర్, బుచ్చాగౌడ్, మహిళలు, రైతులు పాల్గొన్నారు.

● ఇల్లంతకుంట : మండలంలోని తిప్పాపూర్‌లో బుధవారం మహిళా సంఘాల ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఏఎంసీ ఉపాధ్యక్షుడు ఎలగందుల ప్రసాద్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఏపీఎం వాణిశ్రీ, ప్యాక్స్ మాజీ చైర్మన్ ఐరెడ్డి మహేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ దమ్మని లక్ష్మి, గ్రామశాఖ అధ్యక్షుడు బెజ్జంకి తిరుపతి, బెజ్జంకి శ్రీనివాస్, కాదాసు అన్నపూర్ణ, బెజ్జంకి రమ్య, సుదగోని రవి, భాస్కర్‌రావు, మామిండ్ల రమేష్, పౌలు, పర్శరాం, నిర్మల, రజిత పాల్గొన్నారు.

● కోనరావుపేట : మండలంలోని మామిడిపల్లి తదితర గ్రామాల్లో ఐకేపీ, సింగిల్‌విండో ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం కోనరావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య ప్రారంభించారు. కోనరావుపేట సింగిల్‌విండో చైర్మన్ బండ నర్సయ్య, వైస్‌చైర్మన్ అనుపాటి భూంరెడ్డి, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ తాళ్లపల్లి ప్రభాకర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా, పన్నాల లక్ష్మారెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు నాయిని ప్రభాకర్‌రెడ్డి, సాసాల మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● చందుర్తి : మండలంలోని మూడపల్లి, మరిగడ్డ మల్యాల, ఎనగల్ తదితర గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ఏపీఎం రజిత ప్రారంభించారు. బాణాల రవీందర్‌రెడ్డి, పుల్కం మోహన్,పుల్కం లచ్చయ్య, ఇందూరి మధు, ధర్మపురి శ్రీనివాస్, దూది శ్రీనివాసరెడ్డి, సంతపురి బాలు, దారం బాల్‌రెడ్డి వట్టి మల్ల రవి, సంటి దాసు, ప్రసాద్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

● బోయినపల్లి : రైతు సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత ఇస్తోందని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. బోయినపల్లి మార్కెట్ యార్డ్, మర్లపేట, విలాసాగర్ గ్రామాల్లో వడ్ల కొనుగోలు సెంటర్లను బుధవారం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నారాయణరెడ్డి, ఏవో ప్రణీత, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ముదుగంటి సురేందర్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు వన్నెల రమణరెడ్డి, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ నిమ్మ వినోద్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు భీంరెడ్డి మహేశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ పర్లపెల్లి వేణుగోపాల్, మార్కెట్ కార్యదర్శి రమణ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం

తంగళ్లపల్లి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం అంకుసాపూర్ గ్రామంలో జిల్లాస్థాయి క్రికెట్ పోటీలను జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు పూర్మాణి రామలింగారెడ్డి ప్రారంభించారు. అంకుసాపూర్ క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి క్రికెట్ పోటీల్లో 18 టీంలు పాల్గొంటున్నాయని నిర్వాహకులు శ్రీకాంత్, మహిపాల్, తిరుపతిలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కర్కబోయిన కుంటయ్య, నాయకులు కుర్మ రాజయ్య, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో వసతులు కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న గోపాల్‌రావు

ముస్తాబాద్ (గంబీరావుపేట) ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వసతులు కల్పించాలని మండల మాజీ రైతు బంధు అధ్యక్షులు కల్వకుంట్ల గోపాల్‌రావు పేర్కొన్నారు. ముస్తాబాద్ టీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాల్‌రావు మాట్లాడుతూ వరి ధాన్యం కొనుకోలు త్వరత్వరగా చేయాలని, ఎండలు తీవ్రమైనందున మధ్యాహ్నం సమయంలో ఐకెపి సెంటర్ల దగ్గర టెంట్లు ఏర్పాటు చేయాలని మంచినీటిని అందుబాటులో ఉంచాలని రైతులకు గ్లూకోస్ ప్యాకెట్లు ఓఆర్ఎస్ఎల్ అందుబాటులో ఉంచాలని, వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ముస్తాబాద్‌లో వైకుంఠ రథం రిపేరులో ఉన్నందున ఇతర మండలాల నుంచి వైకుంఠ రథం తెప్పియడం వల్ల ప్రజలపై అధికంగా ఆర్థిక భారం పడుతున్నందున అధికారులు వెంటనే వైకుంఠ రథాన్ని రిపేర్ చేయించి వాడుకలోకి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా కోఆప్షన్ మెంబర్ సర్వర్ పాషా, ముస్తాబాద్ పట్టణ అధ్యక్షులు ఎద్దండి నరసింహారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, చెవుల మల్లేశం, సడిమెల ఎల్లం, మాజీ ముస్తాబాద్ పట్టణ అధ్యక్షులు రచమడుగు సంతోష్‌రావు, ముస్తాబాద్ మాజీ కోఆప్షన్ మెంబర్ అన్వర్, బీఆర్ఎస్ పార్టీ మండల యూత్ అధ్యక్షులు శీలం స్వామి, కేటీఆర్ సేన రాష్ట్ర అధ్యక్షులు మెంగని మనోహర్, రజక సంఘం నాయకుడు యాదగిరి, నాయకులు అంకని రంజిత్, గొండయ్య, తదితరులు పాల్గొన్నారు.